# భవబంధాలు

మనోరమ పెళ్ళి నుంచి రాగానే బట్టలు సర్దుకోసాగింది. హడావిడిగా వాచీ చూసుకున్నది. ఏడుంపావు అయింది. 'ఫర్వాలేదు, బండి అందుతుందని' సమాధానం చెప్పుకున్నది. ఇంతలో మాధవి లోపలికి వచ్చింది.

"ఆడపడుచు అలకపానుపు ఎక్కిందేమిటి? వెంటనే ప్రయాణ మవుతోంది."

"మరే వదినగారి మీద వచ్చింది."

"ప్రత్యర్థులం. రావడం సహజమే."

మనోరమ సూట్‌కేస్ సర్ది ప్రక్కనున్న స్టూలుమీద పెట్టింది. వదినగార్ని నవ్వుతూ చూస్తూ: "మరో పావుగంట టైం యిచ్చాను. నీ యిష్టమొచ్చినట్లు పోట్లాడు, నాకేం అభ్యంతరం లేదు." సవాల్ చేసింది.

మాధవి దగ్గరికి వచ్చి గంభీర స్వరంతో అడిగింది. "ప్రయాణం నిజమే నన్నమాట?"

"ఏమిటి పిచ్చి ప్రశ్న వదినా, బట్టలు సర్దుకువ్నా నీ సంశయం తీరలేదన్న మాట ...

"అది కాదు మనో. రాక రాక వచ్చావ్, మంగళ పెళ్ళి సందర్భంగా. రెండు రోజులు అక్కడే వున్నావ్. మాతో గడిపిందేది?" నిష్ఠూరంగా అడిగింది మాధవి.

మనోరమ వదినగారి చేతులు రెండూ పట్టుకుని, బ్రతిమాలే స్వరంతో, "మళ్ళీ వస్తాలే వదినా, హైదరాబాదు రావడం ఎంతసేపు? ఈసారి వారం రోజులు ప్రోగ్రాంతో వస్తాను. అప్పుడు నీ పని పడ్తాను. ఈసారి వదిలెయ్" అన్నది.

"నీ మాటలు నమ్మాల్సిందే. ఎప్పుడూ 'హాస్పటల్' అంటూ కదిలి రావు. ఉత్తరాలు రాయడానికైనా నీకు తీరికుండదు."

మాధవి ఆమె ప్రయాణానికి ఏమీ సుముఖంగా లేదు. ఎట్టి ప్రయాస లేకుండ గుర్తించిందీ విషయం మనోరమ. మాధవి మనస్సుని నొప్పించేలా మూర్ఖ పద్ధతి ఆమె అవలంబించ దలుచుకోలేదు. ఇంతలో మెరపులాంటి ఆలోచన వచ్చింది. ఫర్వాలేదు, వదిన నమ్మేస్తుంది అనుకుంది.

"అది కాదు వదినా, ఈ పెళ్ళికే రాకపోదును. మంగళ టెలిగ్రాంలు కురిపించింది. ప్రెగ్నన్సీ కేసులను నర్సులకి, కాంపౌండర్లకి వదిలేసి వచ్చాను. ఈ సరికే వాళ్ళు నా కోసం చూస్తూ వుంటారు. నీ దగ్గర గడపలేక పోయినందుకు నాకూ బాధగానే వుందనుకో, కాని ఏం చేస్తాం చెప్పు." తగ్గు స్వరంతో సీరియస్‌గా అన్నది.

"ఏమమ్మా డాక్టరుగారూ.... మీ వూర్లో నీ దొక్కటే హాస్పిటలా? ఇంకెవరూ డాక్టర్లు లేరా?" ఎదురు ప్రశ్నించింది.

"ఎందుకు లేరు? ఇంటికో ఆర్. ఎం. పీ. వున్నాడు. వీధికో

యం. బి. బి. యస్సున్నాడు. రోగుల కోసం చూసేవాళ్లూ వున్నారు. రద్దీ వల్ల రోగుల్ని చూడలేని డాక్టర్లూ వున్నారు."

"అయితే యింకేం, నీ అర్జంటు కేసులు ఎవరో ఒకరు చూస్తార్లే. రేపు మార్నింగ్ బయలుదేరి వెళ్ళిపోదువుగాని.... ప్లీజ్."

"అదికాదు వదినా, తాతయ్య ఈ పాటికే కంగారుపడుతూ వుంటాడు. బయలుదేరి వచ్చేస్తాడేమో కూడ."

మనోరమకి వెళ్ళిపోదామని వుంది. మాధవికి వుంచెయ్యాలని వుంది. ఎవరి వాదనలు వారికున్నాయి. ఒకరికొకరు లొంగడం లేదు. ఇక సమస్య పరిష్కరింపబడేదెలా? ఆ ప్రయత్నం తనకి చేతకాక మాధవి భర్త దగ్గరికి వెళ్ళింది.

కృష్ణమూర్తి సిగరెట్ కాలుస్తూ న్యూస్ పేపరు చూస్తున్నాడు. కుర్చీ దగ్గర శ్రీను ఆడుకుంటున్నాడు.

"మీ చెల్లెలు ప్రయాణం అవుతోంది?"

అతడు పేపరులోంచి తల ఎత్తలేదు. "ఎక్కడికీ?"

"మీ వూరు."

"వెళ్ళనీ"

మాధవికి ఉక్రోషం ముంచుకొచ్చింది, పేపరు లాగేస్తూ, "నేను చెబితే వినడం లేదు. ఆ పేపరు తర్వాత చదువుదురుగాని లెండి. మీరయినా చెప్పండి" అంది.

కృష్ణమూర్తికి అప్పటికి అర్ధమయింది. కుర్చీలోంచి లేస్తూ, "మనో వెళ్ళనుంచి రానీ చెప్తాను" అన్నాడు.

"మీ పరధ్యాన్నం మీదే. మనోరమ రావడం, బట్టలు సర్దడం,

అన్నీ అయ్యాయి. ఆ పేపరులోపడితే మీకేదీ గుర్తుండదు." పిల్లాడ్ని ఎత్తుకుంటూ భర్తని ఎత్తి పొడిచింది.

మనోరమ గుమ్మం దగ్గరికి అప్పుడే వచ్చింది.

"వదినగారు సిఫార్సుకి బయలుదేరారన్నమాట" కవ్విస్తూ అడిగింది కోపంలో మాధవిని చూడటం ఆమెకి భలే యిష్టం.

"ఇది రికమండేషన్ల కాలం కదూ! మరి!"

కృష్ణమూర్తి రంగంలోకి వచ్చాడు. "అమ్మాయ్. నువ్వు ప్రయాణమైనట్లు మీ వదిన చెప్పింది. అనివార్యకారణాలవల్ల దాన్ని రద్దు చేస్తున్నాం."

"ఎలాగన్నాయ్.... నువ్వూ లాయరుకదా క్లయింట్లబాధ నీకు బాగా తెల్సు. వదినకి కాస్త నచ్చచెప్పు. అవతల పేషంట్సు నాకోసం. కాసుక్కూర్చుంటారు, ఇప్పటికే లేటయిపోయింది."

రోషంగా అన్నది మాధవి "ఉద్యోగాలు మీ అన్నా చెల్లెళ్ళే చేస్తున్నారు మహా. ఆ బాధలు నాలాంటిదానికేం తెలుస్తాయ్?"

మనోరమ పకపకా నవ్వింది. "వేశావ్ బాణం"

మాధవి జవాబివ్వలేదు.

ఖరారుగా అన్నాడు కృష్ణమూర్తి. "మనో.... మీ వదినకి బాగా కోపం వచ్చేసింది. ఇప్పుడు నువ్వు వెళ్ళావా నా భరతం పడుతుంది. రేపు పదిగంటల బండికి వెళ్ళిపోదువుగానిలే. హాయిగా రెస్టు తీసుకో. ఈ రెండు రోజులు పెళ్ళంటూ ఒకటే హాయిరాన పడ్డావ్."

"సరే" అనక తప్పలేదు మనోరమకి,

మాధవి ముఖం వికసించింది. కొడుకుని ముద్దాడుతూ "ఏరా

శ్రీనూ.... అత్తయ్య వుంటానంటోంది. ఉండమందామా ? వద్దా ?" అనడిగింది.

"ఎదురు తిరిగింది మాట" శ్రీనుగాడ్ని లాక్కుంది మనోరమ.

"ఏ కేసు కోర్టుకి రాకుండ అవదుకదా!" స్వగతంలాగ అనుకుని కృష్ణమూర్తి కుర్చీలో కూర్చున్నాడు.

"లేకపోతే మీ లాయర్లకి పనేం వుంటుంది?

మనోరమ శ్రీనుని ప్రక్కన కూర్చో పెట్టుకుంది సోఫాలో. "ఏవమ్మో పోట్లాడి ప్రయాణం ఆపించావ్. అతిధి ధర్మం మాట మరచి పోయావు. పాయంత్రం నుంచి టీ తాగుదామని ఒకటే ప్రయత్నం."

"నా మతి మండా!" మాధవి వంటింట్లోకి పరుగులు తీసింది.

మనోరమ శ్రీనుని ముద్దులాడుతూ కూర్చుంది.

"చెల్లాయ్.... బట్టలు వేసుకో.... హాయిగా ఎలాగయినా పోదాం" అంటూ క్రానికల్ అందుకుని. "రవీంద్ర భారతిలో క్లాసికల్ డాన్సు వుంది. వై. యం. సి. ఏ లో...." చెబుతున్నాడు.

"వద్దన్నయ్యా. హాయిగా డాబామీద కూర్చుని కబుర్లు చెప్పుకుందాం నాకు ఎక్కడికీ తిరిగే ఓపికలేదు."

ఇంతలో మాధవి టీ లు తీసుకువచ్చి అన్నాచెల్లెళ్ళ కిచ్చింది.

"ముందర టీ తీసుకో. అల్లుడ్ని తర్వాత ముద్దాడుదువుగానిలే!"

"మరి నీకు"...."

"చెల్లాయ్.... తను తాగే మనకి తెస్తుంది. తీసుకో."

"ఆ చమత్కారం వుంది మాట."

మాధవి భర్తని అడిగింది. "మనోని కాస్త ఎటయినా తీసుకు వెళ్ళండి. ఇంతట్లో నేను వంట పూర్తి చేస్తాను."

"రానన్నది." కృష్ణమూర్తి జవాబిచ్చాడు.

మనోరమ స్నానంచేసి మిర్రర్‌లో చూస్తూ బొట్టు పెట్టుకుంటోంది. మాధవి వంట ప్రయత్నంలో వుంది. పదో పనిమీద అక్కడికి వచ్చింది.

"ఏవమ్మా మరదలా, ఇంకా మాకు పప్పన్నం పెట్టవా"?

మనోరమ అలంకరణ పూర్తి చేసుకుని, "ఇప్పుడే పెడతాను, వంటింట్లోకి నడు" అంటూ దారి తీసింది.

"అదికాదులేవమ్మా.... తెలియనట్లు నాటకం."

కృష్ణమూర్తి కొడుకుని ఎత్తుకు వచ్చాడు, "ఏమిటి మళ్ళా పోట్లాటలో వున్నారు. కోర్టు వారు జోక్యం కలిగించుకోవాలా?"

"వద్దులెండి— అయినా మీ చెల్లెలు ఎంత నంగనాచో చూశారా, పెళ్ళెప్పుడమ్మా? అంటే వగలు పోతున్నది." మనోరమపై ఫిర్యాదు చేసింది.

"మా మనూ పెళ్ళంటే మాటలా?— ఎన్ని చూడాలి.... అందం, డబ్బు, తెలివి, మంచితనం, చదువు. అంతస్థు అన్నీ వుండాలి. అందుకే తాతయ్యా, నేనూ తెగ వెతుకు తున్నాం,"

మీరలాగే వెతుకుతూ వుండండి, ఎప్పుడో రోజున మా తమ్ముడ్ని ఈవిడే బయట పెడుతుంది." మాధవి వంటింట్లోకి వెళిపోయింది.

కృష్ణమూర్తి వీధిలోకి వెళ్ళడానికి ఉద్యుక్తుడవుతూ, "చెల్లాయ్ పదినిమిషాల్లో వచ్చేస్తాను నేను. ఒక ఫ్రెండును కలుసుకోవాలి." అని చెప్పాడు.

మాధవి వంటిట్లో నుంచి కేక వేసింది. "పేకాటకేమి స్వామీ!"

"నీ దెప్పుడూ అదేగోల."

కృష్ణమూర్తి వెళ్ళగానే మనోరమ తలుపువేసి డ్రాయరు మీద పర్స్ తీసుకుని వంటింటిలోకి వచ్చింది. "ఏవమ్మా వదినా.... వంటలో సాయపడాలేమిటి చెప్పు. ఆనక నెపం వెయ్యగలవు."

విస్ఫారిత నేత్రాలతో చూసింది. "నువ్వు వంట చెయ్యడమా.... బాగుంది. వెళ్ళి తాతయ్యగారితో వదిన వంట చేయించిందని దండోరా వెయ్యగలవు."

మాధవి ఆ యింటి కోడలు అయిన రోజునే మనోరమ స్థానమేమిటో గుర్తించింది. తాతయ్య సంరక్షణలో, అన్నగారి నీడలో ముద్దుగా పెరిగే ముగ్ధ మనోరమ తండ్రి లేని లోటు అన్న, తాతయ్య తీరుస్తున్నా, తల్లి లేని లోటు మాధవి తీర్చగలిగింది. ఒక విధంగా చెప్పాలంటే వారిరువురి కంటే మాధవే అమితంగా అనురాగాన్ని కురిపించింది.

కేశవయ్య తృప్తిగా నిట్టూర్చాడు. మాధవి రాకతో ఎన్నో సమస్యలు బయలుదేరతాయని, మనోరమకి అన్యాయాలు జరుగుతాయని అతను తల పోశాడు. కాని మంచి స్నేహితుల్లా యిద్దరూ కలిసిపోయారు. అక్కా, చెల్లెళ్ళలో అయినా మద మాత్సర్యాలు వుంటాయేమో కాని, వారిలో మాత్రం లేశమయినా లేవు. జీవిత విధానాలవల్ల ఎడ ఎడంగా వుంటున్నా, ఎప్పుడూ కల్సే ఒకేచోట వుండాలన్న తాపత్రయం వారికుంది. ఆ స్నేహ భావం వారిలో వుంది.

వదిన వచ్చినప్పట్నుంచి, మనోరమ కోరికలన్నీ మాధవి ద్వారానే తీరేవి. మెడిసిన్ చదువుతానని మనోరమ అన్నప్పుడు కేశవయ్య ఒప్పుకోలేదు. హాయిగా పెళ్ళిచేసి పంపెయ్యాలని ఆయన ఉద్దేశ్యం. కృష్ణమూర్తి

కూడా 'అంత పెద్ద కోర్సు నువ్వు చదవలేవమ్మా' అంటూ అభ్యంతరం పెట్టాడు. మనోరమ బిక్కముఖం వేసింది. మాధవి రంగంలోకివచ్చి కేశవయ్యని, భర్తని ఒప్పించింది. ఇద్దరి పట్టుదలవల్ల వాళ్ళు కాదనలేక పోయారు.

"నేను డాక్టర్నయానంటే నువ్వే కారణం వదినా!"

మనోరమకి వదినమీద అపారమైన కృతజ్ఞత వుంది. అందుకే క్లినిక్ ఓపెనింగు మాధవిచేత చేయించింది.

"అదేమిటి మనో... పెద్దవారు తాతయ్య వున్నారు, మీ అన్నయ్య వున్నారు. నేను చెయ్యడమేమిటి.... బాగుండదు." మాధవి అభ్యంతర పెట్టింది.

మనోరమ వదల్లేదు.

కేశవయ్య కూడా బలవంతం చేశాడు. మనవరాలి నిర్ణయమే అతడి నిర్ణయమూ. ఎందుకంటె కొడుకు కోడలు పోయాక తిరిగి మాధవి రాకతోనే ఆ యింటికి వెలుగు వచ్చిందని ఆనందిస్తూంటాడు. ఇంతమంది చెబుతూంటే యింకేం చేస్తుంది?

గతాన్ని ఆలోచిస్తూ వీక్లీ తిరగవేస్తోంది మనోరమ. మాధవి చెబుతున్న కబుర్లకి పరధ్యానంగా 'వూ'కొడుతోంది.

"మీ పాంచజన్యం కథకి బహుమతి వచ్చింది తెల్సా?"

"ఎందుకో" విస్మయంగా అడిగింది.

"మరిందాకటి నుంచి ఏం తిరగవేస్తున్నావు? ఇందులోనే వుంది. నువ్వు చూశావేమో అనుకున్నాను." మాధవి ఉల్లిపాయలు తరుగుతూ అన్నది.

పాంచజన్యం చిన్ననాటి స్నేహితుడు. హైస్కూలులో చదువుతు

న్నప్పుడే నాటకాలు కథలు రాసేవాడు. అతడి కథ ఎప్పుడు వస్తుందని మనోరమ ఆత్రంగా చూస్తూంటుంది. మాధవి చెప్పగానే విషయసూచిక చూసి పేజీ తిరగవేసింది,

"నాకేం నచ్చలేదుసుమీ."

కోపంగా చూసింది మనోరమ. "ముందరే నువ్వు కామెంటు చెయ్యకు ఇంప్రెషన్ ఏర్పడిపోతుంది."

మనోరమ కథ పూర్తయ్యే సరికి కృష్ణమూర్తి వచ్చేశాడు. అంతా ఏకంగా భోజనాలకి కూర్చున్నారు. నవ్వులతో, పరిహాసాలతో, వేళాకోళాలతో సుమారు గంట పట్టింది.

డాబా మీదికి చేరాక మాధవి ప్రశ్నించింది.

"ఎలావుంది కథ?"

"ఇందాకట్నుంచి యిదే ఆలోచిస్తున్నావులా వుంది."

"దాటెయ్యకు. పాంచజన్యం ఏది రాసినా బాగుంటుందంటావ్. ఇప్పుడే మంటావ్?"

"అదే అంటాను."

"ఫేవరిటిజమ్.''

"నువ్వు చెప్పన్నయ్యా!"

కృష్ణమూర్తి సిగరెట్ కాలుస్తూ చందమామని చూస్తూ పడుకున్నాడు.

"ఆ కథల్లోకి కోర్టు వారిని లాగకండి."

"మీ అన్నయ్యకేం తెలుసు? ఆయనకి లా మాన్యూల్సు తప్ప ఏ పుస్తకమూ అక్కర్లేదు. ఆయనేం చెబుతారు?"

"నువ్వు మా అన్నయ్యని ఏం చెప్పి పొడవక్కర్లేదు, ఇద్దరి బదులు నువ్వు చదువుతున్నావుగా. నీదయవల్లే అన్ని పత్రికలు బతుకుతున్నాయి". కయ్యానికి దిగింది మనోరమ.

"తర్వాత పోట్లాడుదువుగానిలే. అసలు విషయం చెప్పు. ఆ కథ బాగుందా?"

"బాగుంది." రెట్టించింది,

"నువ్వు చెప్పాలి. జమీందారు కూతురు విశాల హృదయంతో హంతకుడ్ని పెళ్ళిచేసుకుంటుందా? అతడ్ని మార్చాలని చూస్తుందా? అంతా సినిమాటిక్‌గా వుంది. 'మోస్ట్ అన్నాచురల్'. పేరున్నవాడు రాశాడు కనుక సరిపోయింది. ఇదే ఏ చిన్న రచయితో రాస్తే అంతా తూర్పార పడుదురు" ఆవేశంగా చెప్పుకు పోయింది.

చిన్నగా నవ్వుతూ లేచి కూర్చుంది. మనోరమ. 'సాహిత్యంలో వైవిధ్యం వుండాలి వదినా .... మనం ఎరగనంత మాత్రాన అస్వాభావికం ఎలా అవుతుంది? మనచుట్టూ వున్న ప్రపంచాన్ని మనం ఏం చూడగల్గుతున్నాం? అయినా మనుషులందరూ ఒకేలా ఎందుకుండాలి? ఒకేలా ఎందుకు ఆలోచించాలి. తనకి తోచింది ఆ జమీందార్ కూతురు చేసింది. నినాదాల్లో నిజాల్ని చెప్పేబదులు నిర్ధారణపరచి ప్రయోగపూర్వకంగా రుజువుచేసి చూసింది. అందులో అసంగతం ఏముంది?

"అది కథ కనక బాగుందంటున్నావ్. నిజజీవితంలో ఎవరు చెయ్యగలరు?"

"చిల్లర కథలు అందర్నీ ప్రభావితం చేస్తాయి. మంచి కథలు కొందర్నే ప్రభావితం చేస్తాయి. మనం అభిప్రాయాలకి, ఆలోచనలకి,

దూరంగా వున్నంత మాత్రాన, నిజం విలవలేకుండాపోదు. మా రుప్ప సంఘంయొక్క ముఖ్య లక్షణం, కొత్తని పాత చేస్తూ ముందుకు పోతూంటుంది సంఘం. పాంచజన్యం ఈరోజు రాసినది పదిమంది ఆచరిస్తే, అదే అలవాటయి కూర్చుంటుంది. పాతయిపోతుంది. ఆ రోజున నీలాంటి వారు బాహాటంగా ఒప్పుకుంటారు. ఎట్టి వంకా చూపరు."

మాధవి సరిపెట్టుకోలేక పోయింది. మనోరమ వాదన సమంజసంగా [illegible]ధులో నిజాయితీని మాత్రం భరించలేకపోయింది మాధవి.

"ఉపన్యాసాలకి ఎన్నయినా చెప్పవచ్చు. నీకు పాంచజన్యం రాసింది వేదంకావచ్చు. అంతా అలాగే ఆలోచించరు కదా! పదిమందికీ విరుద్ధమైన నిజం కూడ కాలగర్భంలో కల్సిపోవల్సిందే!"

"నువ్వేలా చెప్పగలవ్? ఈ తరం వాళ్ళకి ఏహ్యంగా కనిపించింది, ఎదుటి తరం వారికి విలువైనదిగా తోచవచ్చు. కొత్త కోసం ఎగబడేవాళ్ళు కొందరయినా వుంటారు. వాళ్ళే భవితవ్యానికి పునాదిరాళ్ళు. వారు చూపించిన ధైర్య సాహసాలే రేపటి తరానికి విజయ ధ్వజాలు."

కృష్ణమూర్తి యిరువురి వాదనలు వింటూ, సిగరెట్లు మసి చేస్తున్నాడు. ఎవరూ ఓడిపోయినట్లు కనిపించడం లేదు. అతడికి హాయిగా కబుర్లు చెప్పుకోవాలని వుంది. ఇంతలో తగ్గేటట్లు గోచరించక, "ఆ కథ కోసం యింత పోరాటం ఎందుకే బాబూ ఆగండి" యిద్దరికీ చెప్పాడు.

"ఇద్దరి వాదనలు విన్నారు కదా, మీరే చెప్పండి? భర్త మధ్యవర్తిత్వాన్ని కోరింది.

"మళ్ళీ మా అన్నయ్యని లాగుతావెందుకు. ఏం తెలియదని వాదించావుకదా మొదట. ఓడిపోయానని ఒప్పుకో వదినా!" మనోరమ గేలి చేసింది.

"ఓడిపోయింది ఎవరో స్పష్టంగా తెలుస్తూనే వుంది. ఈ కథ పాంచజన్యం రాసేడు గనుక యింత మెచ్చుకుంటున్నావ్. ఇంకెవరు రాసినా లక్ష వంకలు నువ్వే పెడుదువు?"

"కథని స్పష్టంగా అంచనా వెయ్యకుండా, రచయితమీద అభిమానంతో ఉపన్యాసం యిచ్చావు. రేపు వారం ఉత్తరాల శీర్షిక చూడు ఎంత మంది రాస్తారో – బహుమతి యివ్వటం అనుచితం అంటూ."

"అంతా నీ లాంటి వాళ్ళే అయి వుంటారు. ఉత్తరాలు, ఉపన్యాసాల మాట ఎలా వున్నా ఈ కథ గురించి ఆలోచించేవాళ్ళు కొందరయినా వుంటారు. జీవితంలో వైవిధ్యం కోరుకొనే వాళ్ళకిది మంచి టానిక్.

అడ్వంచర్స్ మీద యిష్టం వున్న వాళ్ళకి మంచి సబ్జక్టు.

"చూద్దాంగా."

"అంతా నువ్వు చూస్తుండగానే జరుగుతుంది. జమీందారు కూతురు జమీందార్ని పెళ్ళి చేసుకోవడం రివాజు. అందులో కిక్ ఏంలేదు. సమాజానికి హానికరమైన వ్యక్తి హంతకుడు. అతడి దౌష్ట్యం శిక్షలతో తగ్గదు. తన జీవితంలో చోటిచ్చి కనీసం ఒక వ్యక్తినయినా మార్చ గలిగింది జమీందారు కూతురు. ఆ సాహసానికి మన మెంతో మెచ్చుకోవాలి. ఎడ్వాన్స్‌గా నువ్వు ఆలోచించలేవు. కనుక నీకు చేదుగా వుంది కథ." ముగింపుగా అన్నది మనోరమ.

చాలారాత్రి వాదనతోను, కబుర్లతోను గడిచిపోయింది.

మర్నాడు పదిగంటలకి మనోరమ ప్రయాణమైనది. మాధవి చీర, రవిక తెప్పించింది.

"ఇప్పుడెందుకు వదినా?"

"అది రివాజు – కాదనకు."

కృష్ణమూర్తి, మాధవి స్టేషనుకు వచ్చి రైలు ఎక్కించారు.

"వెళ్ళగానే ఉత్తరం రాసి పడెయ్యమనో. లేకపోతే ఆదుర్దాగా వుంటుంది"

"అలాగే వదినా. నువ్వోసారి రాకూడదూ!"

నవ్వింది మాధవి. "మీ అన్నయ్య భోజనం...."

సూటిగా చూసింది మందహాసం చేస్తూ. "తప్పంతా మా వాడిమీద తోసెయ్యకు, నీకు రావాలంటే దారే దొరకదా" అని అన్నగారి కేసి తిరిగి, "పిలు చూసుకుని రండ్రా" ఆహ్వానించింది.

"అలాగే నీ పెళ్ళికి వస్తాం...."

రైలు కదిలింది.

* * *

"మీ పేపరు ఒకసారి యిస్తారా!"

ఎదుటి సీటులో కూర్చున్న వ్యక్తి మర్యాద పూర్వకంగా అడిగాడు. సెకండ్ క్లాస్ కంపార్టుమెంటులో నలుగురు కంటె లేరు. అంతా ఎవరి గొడవలో వారున్నారు.

శబ్దం వచ్చిన దెస మనోరమ చూడలేదు. ఆమె హృదయం స్పందనగా వున్నది. యాంత్రికంగా పేపరు అందించింది.

శ్రీను ముద్దు మాటలు, అల్లరి, అన్నయ్య హాస్యం, వదిన చమత్కారాలు అన్నీ గుర్తుకు వస్తున్నాయి. వదిన ఎప్పుడూ అంతే.... ఏదో వాదన వేసుకుంటుంది. డిఫెన్సు లేకపోయినా పట్టుదలకయినా గాలి పోగుజేసుకుని కలియబడుతుంది. తను ఓడిపోయినా, గెలిచానంటుంది. ఆమెతో కాలం యిట్టే గడచిపోయింది. రోజు నిమిషంలా గడచిపోతుంది, సాహసించి

మరో రోజు వుందామన్నా లేదు. హాస్పిటల్ కుంటుపడుతుంది. దానివల్లే తను బతకాలని లేకపోయినా గుడ్‌విల్ పోతుంది.

రైలు ఆగి బయలుదేరింది.

"ఇదుగో మీ పేపరు."

మనోరమ దృష్టి నిలపకుండా పుచ్చుకున్నది.

"ఎక్కడిదాకా వెళుతున్నారు ?"

"..... ..... ....."

"మిమ్మల్నే ?...."

"..... ..... ....."

"బెజవాడా ?"

మనోరమ ఉలిక్కిపడింది. ఎదుటి సీటులో పాతికేళ్ళ యువకుడు తనకేసి నవ్వుతూ చూస్తున్నాడు. మనోరమ మండి పడింది.

"ఏయ్ మిస్టర్. వేషం డాబుగానే వేశావ్. కనీసం సంస్కారం కూడ కనిపించడంలేదు నీలో. నా పర్సనల్ విషయాలు నీ కెందుకు ?"

నవ్వాడు అతడు.

"సిగ్గు లేకపోతేసరి" అనుకుని పేపరు అడ్డు పెట్టుకుంది. ఆ యువకుడి హీనమైన ప్రవర్తనకు మనోరమకి అసహ్యం వేసింది. "డర్టీ మాసెస్! మనం ఎంత ఎదిగినా ఈ వెకిలితనం మాత్రం పోలేదు."

డోర్నకల్ వదిలేసింది రైలు. మనోరమ కిటికీలో నుంచి బయటికి చూస్తూ, క్షణక్షణానికి వాచీ చూసుకుంటుంది. ఆమెకీ ప్రయాణం చాల విసుగ్గా వుంది. రైలు ఎంత వేగంగా పోతున్నా ఆమెకి తృప్తి లేకుండా వుంది.

"మీ దగ్గర ఎంత డబ్బు వున్నదో చెప్తారా ?"

"వాట్ డుయు మీన్ రోగ్" బుసలు కొడుతూ లేచి నిలబడింది.

ఆ యువకుడు కూడ లేచి దగ్గరకి వచ్చాడు. "మీ కోపం చాల బాగుంది. ఐ లైకిట్."

మనోరమ హతాశురాలైనది. "ఏయ్ మిస్టర్. అనవసరంగా గొలుసులాగే ప్రయత్నాన్ని రెచ్చగొట్టి, మిగతావారి ప్రయాణాన్ని పాడు చేయవద్దు."

"అది మీ చేతిలో వుంది. మర్యాదగా డబ్బిచ్చేస్తే యిప్పుడే వెళ్ళిపోతాను.

"ఎవరు నువ్వు" విస్మయంగా ప్రశ్నించింది.

"చెప్పాలా?"

".... .... ...."

"దొం....గ"

మనోరమ అదిరిపడింది. కంపార్టుమెంటు అంతా కలియ చూసింది. తామిద్దరు తప్ప ఎవరూ లేరు.

అందుకే యింత సాహసం చేశాడు. ఈ కాలంలో దొంగతనాలు విచిత్రంగానూ, తమాషాగాను జరుగుతున్నాయి. దొంగ ఎవరో దొర ఎవరో కనిపెట్టడం అసాధ్యమవుతున్నది.

"ఏమిటాలోచిస్తున్నారు.... ఎంతివ్వనా అనా ?" చిలిపిగా అడిగాడు.

"అదికాదు. ఎందుకివ్వాలా అని."

"నేను దొంగను కాబట్టి. మీ క్షేమం కోసమయినా యిచ్చితీరాలి."

"అలాగా"

అతడు నిర్లక్ష్యంగా సిగరెట్ వెలిగించాడు. మనోరమని నిశ్చలంగా చూస్తూ "మీరు నన్ను అసహ్యించుకున్నా ఫర్వాలేదు. దొంగతనం నా వృత్తి. దానికోసం నా జీవితాన్ని అంకితం చేశాను. మీరు మర్యాదగా యిచ్చేస్తే అది యిద్దరికీ లాభం. పట్టుదలకి పోతే మాత్రం ప్రమాదం. మీరున్న పరిస్థితి ఏమిటో మీకు తెల్సు" అన్నాడు.

జారిపోతున్న ధైర్యాన్ని కూడగట్టుకుని డాంబికంగా అంది. "ఏ మిస్టర్. దొంగతనం నా వృత్తి అని గర్వంగా చెబుతున్నావ్. సిగ్గులేదూ."

"సిగ్గు ఎందుకూ ? వైద్యం మీ వృత్తి కదా! అలాగే"

"నేను తెల్సా?" ఆశ్చర్యంగా అడిగింది. అతడ్ని పరిశీలనగా చూసింది. ఏమీ జ్ఞాపకం రావడం లేదు.

"తెల్సు" కరకుగా వచ్చింది జవాబు.

"ఎలా ?"

"మంగళ పెళ్ళికి నువ్వు హైద్రాబాద్ వెళ్లావ్ మనోరమా!"

ఎంతో పరిచయమున్నట్లు అతడు చెబుతూవుంటే నివ్వెరపోయింది. మనస్సంతా సంశయాస్పదమైనది. ఎవరితడు ? తనకి చూసినట్లు కూడ జ్ఞాపకం లేదు. కాని అతను మాత్రం ఎంతో పరిచయమున్నట్లు మాట్లాడుతున్నాడు. ఏమిటి మిస్టరీ ?

"చక్రవర్తి నీకు గుర్తుండడం కష్టం మనోరమా!"

మంచులా విడిపోయాయి ఆమె ఆలోచనలు. చక్రవర్తి....చక్రవర్తి. తెరలు తెరలుగా జ్ఞాపకాలు రేగుతున్నాయి. అన్ని దృశ్యాలు అంతరంగంలో కదలాడుతున్నాయి. మనోరమకి కాస్త స్థిమితం చిక్కింది. సీటులో చివరగా కూర్చుంటూ, "నువ్వా చక్రవర్తీ" విస్మయంగా ప్రశ్నించింది.

"నేనే. నీ దయవల్ల యిలాగ వున్నాను."

ఛళ్లున కొట్టినట్లయింది. "నా.... దయా"

"ఆ.... నీ దయే" వెటకారంగా అన్నాడు.

ఆమె గతాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ, "నిన్ను నీవు మరచిపోవద్దు చక్రవర్తీ! జరిగినదేమిటో నాకు బాగా తెలుసు. నన్ను మధ్యన యిరికిస్తా వెందుకు? నువ్వు ఎన్నుకున్న జీవన విధానమే నిన్ను దెబ్బతీసింది" నెమ్మదిగా అన్నది.

రైలు ముందుకు పరుగులు తీస్తోంది.

మనోరమ ఆలోచనలు వెనక్కి పరుగులు తీస్తున్నాయి.

పి. యు. సి. చదివే రోజుల్లో....

ఆ రోజు బాటనీ ప్రాక్టికల్స్ లేటయింది. ముందర చేసిన స్నేహితులందరూ వెళ్ళిపోయారు. చివర్న మనోరమ మిగిలింది. లెక్చరర్ చేత "యస్" అనిపించుకుని బరువుగా నిట్టూర్చింది మనోరమ. కంగారుగా పుస్తకాలు తీసుకుని, నిశ్శబ్దంగా సుదూరమైన సైన్సుబ్లాక్ దాటి బయటికి వచ్చింది.

వాచీ ఏడు చూపిస్తోంది. నల్లటి చీకటి కురుస్తోంది. కాలేజీలో అక్కడక్కడ దీపాలు నామమాత్రంగా వెలుగుతున్నాయి. మనోరమ వేగంగా నడచి కాలేజీ ఆవరణ దాటి బయటికి వచ్చింది.

రోడ్డు ప్రక్కన రిక్షాలు లేవు. అయిదు దాటితే అక్కడ రిక్షాలు కనిపించవు. ఊరికి దూరంగా వుండటంవల్ల ఎవరూ రారు. మనోరమ నిరాశగా దిక్కులు చూసింది. రోడ్డు ప్రక్కనవున్న కాకాహోటల్స్, కిళ్ళీ బడ్డీలు కూడ మూసివేస్తున్నారు. తాను అక్కడ నిలబడటం నిష్ప్రయోజనం.

అది మరింత ఆలస్యమవడానికే తోడ్పడుతుంది తప్ప వేరే ఉపయోగంలేదు. ఇప్పటికే తాతయ్య కంగారు పడుతూంటాడు.

మనోరమ నడక ప్రారంభించింది.

నల్లటిరాత్రి, రోడ్డు సందడిగానే వుంది. లారీలు, మోటార్లు జిగేల్ మంటూ దూసుకుపోతున్నాయి. మునిసిపాలిటీ దీపాలు నామ మాత్రంగా వెల్గుతున్నాయి. రోడ్డువారగా బెరకుగా నడుస్తోంది.

మనోరమ కాలేజీకి రోజూ రిక్షామీదే వస్తుంది. నడవడానికి కేశవయ్య ఒప్పుకోడు.

అలవాటు లేకపోవడంవల్ల కాళ్ళు నెప్పిపుడుతున్నాయి. ఎంత లేదన్నా యిల్లు యింకా మైలున్నరలో వుంది. ఎప్పటికీ తరగని రోడ్డుని, తన నిస్సహాయతను తిట్టుకుంది.

"వెధవరోజు ఒక్క రిక్షా దొరకడంలేదు" మనోరమ కసిగా మూల్గింది. రిక్షా కనబడితే పది రూపాయిలయినా పడేసేలా వుంది.

గాంధీ సెంటరు చేరుకోగానే బలంగా నిట్టూర్చింది. ఫర్వాలేదు. ఇంక అరమైలు కష్టపడితే ఇల్లు చేరుకుంటుంది తను. వదిన ఈపాటికే గేటుదగ్గర తనకోసం తాతయ్యకి తెలియకుండా పచార్లు చేస్తూంటుంది. తాతయ్యకి తెలిస్తే ఏమైనా వుందా? అయినా వదిన ఎన్ని అబద్ధాలు చెప్పినా తాతయ్య అడగక మానడు. మనోరమ ఆలోచిస్తూ వేగంగా నడుస్తోంది. ఆమె కళ్ళ ఎదుట కనపడేది రోడ్డు పొడుగు ఒక్కటే.

"మనో ..."

వెనకాలనుంచి పిలుపు వినిపించింది. మనోరమ బెదురుతూ చూసింది. తన వెనక ఎవరో వున్నారు. రోడ్డు చీకటిగా వుండటంవల్ల స్పష్టంగా తెలియలేదు. ఆమె మనస్సులో ఏదో కలవరం బయలుదేరింది.

"మ....నో" మళ్ళీ వినిపించింది.

మనోరమ వేగాన్ని తగ్గించి, — క్షీణించిపోయిన స్వరంతో ప్రశ్నించింది "ఎవరు?" వెనకనుంచి సమాధానం రాలేదు. సన్నటినవ్వు వచ్చింది.

మనోరమ వెనక్కి చూసింది.

"నేనే మనోరమా" ఓ యువకుడు దగ్గరికి వచ్చాడు.

మనోరమ అప్రతిభురాలయింది. శరీరం కంపించింది. రోడ్డుమీద దాదాపు నిర్మానుష్యంగా వుంది. తను ఏ పరిస్థితిలోవుందో గుర్తించుకుంది. వెంటనే పరుగులు తీస్తున్నట్లు ముందుకు నడచింది. వెనుకనుంచి "మనోరమా" అని వినిపిస్తూనే వుంది. మనోరమ వెనక్కి చూడలేదు. ఆగలేదు.

ఇంటికి వచ్చినా వణకు తప్పలేదు.

"ఏమిటి మనో అలా వున్నావ్?" వదిన అడిగింది.

మనోరమ ఏమీ చెప్పలేదు. చెప్పలేకపోయింది. చెప్పాలనివున్నా ఏవో సాంఘిక సూత్రాలు అడ్డువచ్చి మాట్లాడలేకపోయింది.

కేశవయ్య అడిగిన ప్రశ్నలకు ఓపికగా జవాబులిచ్చి, మేడమీద తన గదిలోకి పోయి పడుకుంది. ఆ దృశ్యమే కళ్ళముందు వుంది. ఎవడు వాడు? రోమియోలాగున్నాడు. మనోరమకి భయంకల్గించే సంఘటనలు— యివే రకంవి ఎన్నో గుర్తువచ్చాయి. పెద్ద పెద్ద దీపాలు వెలుగుతున్న, చీకటిలాంటి భయం ఆమెను తరుముకు వచ్చింది.

మర్నాడు కాలేజీలో లతతో చెప్పింది.

"ఎవడో పోకిరీ వెధవలా వున్నాడు. అలాంటి వెధవల్ని లెక్క చెయ్యక్కర్లేదు."

"నీ సాహసం నాకు లేదు లతా!"

వారం రోజులు గడిచిపోయినాయి. మనోరమ తాత్కాలికంగా ఆ భయాన్ని మరచిపోయింది. ఒకవేళ ఎప్పుడయినా జ్ఞాపకం వచ్చినా తనకి తానే ధైర్యం చెప్పుకునేది. ఆ రోజు బాగోక అలా జరిగింది. రోజూ జరుగుతుందా? అని సర్ది చెప్పుకునేది. తన పిరికితనాన్ని, కంగారుని అణచుకుంది.

ఓ రోజు సాయంత్రం బాల్కనీలో బాటనీ రికార్డు తయారుచేస్తూ, రిఫరెన్సు పుస్తకం తిరగవేస్తూండగా ఓ కాగితం క్రింద పడింది. కుతూహలంగా తీసింది.

"డియరెస్ట్ మనో,

ఆ రోజు అలా పరుగులు తీశావేం... అబ్బా రన్నింగ్ రేసులో నీకు ప్రయిజు యివ్వచ్చు. ఆ తర్వాత నీ కోసం కాలేజీ అంతా వెతికినా నీ దర్శనం కావడం లేదు. మనో.... నిన్ను చూడని రోజున నాకు అమావాశ్య. ఏమీ తోచదు. ప్లీజ్ మనో! రోజుకి ఒకసారయినా నీ దర్శనం యియ్యి. ఆ వరం ప్రస్తుతానికి చాలు. చంద్రుని కోసం చకోర పక్షిలా, భానుడి కోసం కలువలా.... నీకై ఎదురుచూస్తున్నాను. నీ ఉత్తరం కోసం తపస్సు చేస్తున్నాను.

మన్నిస్తావు కదూ! లవ్

చక్రవర్తి."

మాధవి కాఫీ తీసుకురావడంతో, ఉత్తరాన్ని దాచేసి, ఆలోచనలతో కాఫీ అందుకుంది. లోపల ఎన్నో ప్రశ్నలు!

ఆ ఉత్తరం ఈ పుస్తకంలోకి ఎలా వచ్చింది?

"మరదలు పిల్ల పరాకుగా వుంది. ప్రేమలో పడిందేమిటి?"

నవ్వుతూ వేళాకోళం చేసింది మాధవి.

వదినకేసి చురుకుగా చూసింది.

"నీకెప్పుడూ వేళాకోళమే" అన్నది పైకి మాత్రం.

కాని లోపల బెరుకుగానే వుంది. వదిన ముందరగా ఈ పుస్తకంతీసి ఆ ఉత్తరం చూసిందేమో.... అందుకే అలాగ అందేమో.... రకరకాల ఆలోచనలు పీడించాయి.

వెంటనే నౌకర్ని లత కోసం పంపింది.

స్నేహితురాలు లత కూడ ఆ వీధిలోనే వుంటోంది. ఆమె నాన్న గారు ఆయుర్వేద వైద్యులు. రెండు కుటుంబాల మధ్య రాకపోకలున్నాయి. చిన్నప్పటి నుంచి కలసిమెలసి వున్నారేమో లత మనోరమ నీళ్లు పాలు క్రింద కలిసిపోయారు. ఏ మాత్రం కంపనం రేగినా మనోరమ భరించలేదు. దాని పీడనానికి తట్టుకోలేదు. కాని లత మంచి స్థయిర్యం కలది. ఎలాంటి ఛాలంజీకయినా ఆమె నిలుస్తుంది. ఈ భేదంవల్ల వారి స్నేహం మరింత వృద్ధి పొందింది. మనోరమకి ఆమె మంచి డిఫెన్సు.

"పైకి నంగనాచిలా వుంటావ్, హీరోయిన్‌వయి కూర్చున్నావు." వస్తూనే లత దండకం అందుకుంది ఆమెని ఏడిపించడానికి.

"వదినా, నువ్వూ ఒకటే." మూతి ముడుచుకుంది.

లత ఉత్తరాన్ని చదువుతోంది.

"ఎవడీ రాస్కెల్. నా మీద పడ్డాడు." రోషంగా అడిగింది మనోరమ.

ఉత్తరాన్ని చదివి, "మొత్తానికి చక్రవర్తినే పట్టావు. అన్నట్లు యిది ఎలా వచ్చింది.... పోస్టులోనా ?" ప్రశ్నించింది.

మనోరమ చెప్పింది, "అదే అర్థం కావడంలేదు."

"ఇందులో అర్థంకానిది ఏముంది. నువ్వు పుస్తకం తీసుకుని లైబ్రరీ నుంచి నేరుగా వచ్చేశావా?"

మనోరమ ఆలోచిస్తూ: "లేదు. పుస్తకం తీసుకుని రీడింగ్ రూంలో 'మదరిండియా' తిరగవేశాను" అన్నది.

"అప్పుడే నీ లవర్ ఈ ఉత్తరాన్ని గుచ్చి వుంటాడు."

"ఛీ.... అసహ్యంగా మాట్లాడక."

ఆ తర్వాత రోజుకి ఒకటి చొప్పున కాలేజీ ఎడ్రస్సుతో మనోరమకి ఉత్తరాలు అందుతున్నాయి. ఆదివారం కూడ ఎలాగోలా వస్తున్నాయి. నిస్సహాయత, భయం ఆవరించి మనోరమని విచారమయం చేశాయి. ఈ ప్రవాహం ఎలాగ దాటాలో ఆమెకి తెలియలేదు. ఈ సమస్యవల్ల ఆమె ఆనందం హరించిపోయింది.

ఒకసారి కొంటీను నుంచి వస్తోంది.

"మనోరమా" వెనకనుంచి పిలుపు.

మనోరమ ధైర్యంగా ఆగింది.

చక్రవర్తి దగ్గరకి వచ్చాడు. "నీ ఉత్తరం కోసం చూస్తున్నాను."

"ఎందుకు?" తీక్షణంగా అడిగింది.

"నువ్వంటే నాకిష్టం."

"ఏ మిస్టర్ మర్యాదగా మాట్లాడు."

"మనో" అతడు ఆమె చెయ్యి పట్టుకున్నాడు.

చక్రవర్తి చెంప 'చెళ్' మంది.

"ఈ పరాభవం కోసమే యింత మొండి సాహసం చేశావ్. కాని నిన్ను యింతటితో వదలను" బుసలుకొడుతూ అక్కడ్నుంచి వెళ్ళిపోయింది.

"వదలకు. రిపోర్టియ్యి ప్రిన్సిపాల్‌కి. రోగం కుదురుతుంది." లత హెచ్చరించింది.

చక్రవర్తి రాసిన ఉత్తరాలు చూపించింది. క్యాంటీన్ దగ్గర చక్రవర్తి ప్రవర్తన చెప్పింది ప్రిన్స్‌పాల్‌తో. పైగా లత సాక్ష్యం.

చక్రవర్తికి కాలేజీనుంచి బహిష్కరణ.

ఇదీ ఫలితం.

"తను తొందరపడిందేమో" మనోరమ ఒకటి రెండుసార్లు మథన పడింది. తర్వాత తనకితానే ధైర్యం చెప్పుకుంది.

ఇందులో తన అపరాధం ఏమీ లేదు. చక్రవర్తి ప్రవర్తనే అతడికి శిక్ష వేసింది. అంతే. తను ఈ నిర్ణయం తీసుకోకపోతే, ఈ పాటికి చక్రవర్తి మితిమీరి ఉండేవాడు. తను విషమచక్రంలో బంధింపబడి వుండేది.

మనోరమ చక్రవర్తికి విధించబడిన శిక్ష సమంజసమైనదేనని భావించింది. ఈరకంగా తను సమస్యనుంచి విముక్తురాలయింది. ఇది తనకి మేలు చేసిందేతప్ప కీడు చెయ్యలేదు.

అతి కొద్దికాలానికే చక్రవర్తి వ్యవహారం మరచిపోగల్గింది.

నాటికి నేడు రైలులో సమావేశం జరిగింది హఠాత్తుగా.

అవాంఛనీయ సంఘటన :

"మెరిసే దంతా మేలిమికాదు మనోరమా. పైగా అందమైన దాని వన్న అహం వుంది నీకు. అందుకే ఇంత అత్యాచారం చెయ్యగలిగావు. నా వ్యక్తిత్వంపై దారుణమైన దెబ్బతీశావు. నా పతనాన్ని చూశావ్. నిజంగా నువ్వు రాక్షసివి." చక్రవర్తి ఆవేశం ప్రదర్శించాడు.

మనోరమ మౌనం వహించింది.

ఇది చక్రవర్తికి మరీ కోపం రప్పించింది. కొత్త సిగరెట్ ప్యాకెట్టులో నుంచి సిగరెట్టు తీసుకుని వెలిగించుకుంటూ, "నిన్ను నువ్వు ప్రశ్నించుకో మనోరమా.... నీ తప్పు తెలుస్తుంది. జీవితం మీద ఎన్నో కలలు కన్నాను. ఎంతో నమ్మకాన్ని పెంచుకున్నాను. అన్నిటిని తోసి రాజన్నావే. నీ అమృతహస్తం పడకపోతే నేనూ డాక్టరుగా తయారయ్యే వాడినే!" తీవ్రంగా అన్నాడు.

చక్రవర్తి ఆవేశాన్ని ఆమె పట్టించుకోలేదు. ఓడిపోయిన మనిషి యొక్క హావభావాలు రక రకాలుగా వుంటాయి. వాటి యొక్క లోతు కూడ బహుతక్కువ. చక్రవర్తిని పరిశీలనగా చూచింది. ఒళ్ళంతా దిగులు వ్యాపించివుంది. ఖరీదైన దుస్తులు కళలేని శరీరానికి విలువని ఏర్పరచలేక పోతున్నాయి.

"నెపం నా మీద వెయ్యక. నా రక్షణ కోసం నేను జాగ్రత్తలు తీసుకున్నాను. నాపై దురాక్రమణ చెయ్యాలని చూసి దెబ్బ తిన్నావ్. నీ హద్దులో నువ్వుంటే ఈ ఆపద నివారింపబడి వుండేది. అయినా గతాన్ని గురించి ఆలోచించడం అంత మంచిది కాదు. ఒలికిపోయిన పాల గురించి ఎంత విచారించినా ఫలితం లేదు."

"నీ నీతులు నా కవసరంలేదు. ఎంత చచ్చిన పామునయినా నాకూ పౌరుషం వుంది. నా జీవితాన్ని యిలా నరికిన పాపం వృధా పోదు."

"శాపం ఇస్తున్నావా?" పరిహాసం చేసింది మనోరమ.

"కర్కశత్వం నాలో కరడు కట్టుకుని వుంది. నన్ను రెచ్చగొట్టి ఛాలెంజీ చెయ్యకు. నన్ను నువ్వు మరచిపోవచ్చు. కాని నిన్ను నేను మరచిపోలేదు. నా గురించి నీకు తెల్సింది బహు తక్కువ. ఈ ఆరేళ్ళ

నుంచి దొంగల ప్రపంచానికి చక్రవర్తిలా బతుకుతున్నాను. మనుషుల్ని ఎలా దెబ్బకొట్టాలో నాకు బాగా తెల్సు"

ఆ ఉద్వేగానికి మనోరమ చలించిపోయింది. భీరవత ఆవరించింది. వాచీ చూసుకుంది. ఇంకా విజయవాడ చేరడానికి అరగంట వ్యవధివున్నది. చక్రవర్తిని రెచ్చగొట్టడం తనకి అనవసరం. ఏ విధంగానూ లాభంగాదు. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో అతడు తనవల్ల దెబ్బతిని వున్నాడు. ఆ కసి అతడిలో వుంది. అది పశుత్వంగా మారిపోవడానికి ఎంతోసేపు కానక్కర్లేదు. అందులోను చక్రవర్తి పెరిగే వాతావరణ లక్షణం దౌర్జన్యాన్ని యిట్టే ప్రేరేపిస్తుంది. ఈ బాక్స్‌లో తనకి డిఫెన్సు ఏమీలేదు. చక్రవర్తి కాఎర్షన్ ఎంప్లాయ్ చేస్తే తను ప్రతిఘటించలేదు. అందుకే మౌనంగా వుంటేసరి.

పది నిముషాలు కరిగిపోయాయి.

నిశ్శబ్దాన్ని చీలుస్తూ చక్రవర్తి కంఠం ఎత్తాడు. "మనోరమా.... నీ జీవితం వడ్డించిన విస్తరి. ఆ భగవంతుడు నీలాంటివార్ని స్పెషల్‌గా తయారుచేశాడు. మీకు లోకంలోని బాధలు, సమస్యలు అర్థంకావు. కాని ఒకటిమాత్రం గుర్తుపెట్టుకో. ఈ సంఘంలో మెసిలే జనంలో దురదృష్ట వంతులే ఎక్కువ. విషాదమే వాళ్ళకి దేముడిచ్చిన వరం. ఏ వెలుగు కోసం ఆశ పడుతున్నారో, దాన్ని వాళ్ళు జీవితకాలంలో చూడలేరు. పెంచుకున్న ఆశలు వేరు. ఎంచుకున్న జీవితం వేరు. రెంటికీ ఏ మాత్రం సామీప్యం లేదు. వీటి సంఘర్షణలో జీవితం ఎటు పోతుందో, ఎందుకు పోతుందో అర్థం కాదు."

చక్రవర్తి గొంతుక గాద్గదిక మయిపోయింది. అందులోని దైన్యానికి మనోరమ కదిలింది. చక్రవర్తిని జాలిగా చూసింది.

"సామాజిక వ్యతిరేకమైన ఏ క్రియా శాంతినివ్వదు చక్రవర్తీ. హాయిగా చదువుకున్నావ్. దొంగతనాలు మానేసి సవ్యంగా కాలం గడిపితే నీ సమస్యలు అన్నీ తీరిపోతాయి. బ్రతుకులోని తీపి తెలుస్తుంది."

క్రూరంగా నవ్వాడు. "చాల్లే.... నీతులు ఎన్నయినా చెప్పచ్చు."

"నేనేం ఉపన్యాసం యివ్వడం లేదు. వాస్తవం చెబుతున్నాను. దేనిమీదో కసితో, జీవితాన్ని మరింత వంకర చేసుకోడం అమానుషం. ఏకాంతంలో నీకు నువ్వు ఆలోచించుకోగలిగితే బాగా తెలుస్తుంది.

చక్రవర్తి ఆమె కేసి అసహ్యంగా చూశాడు. కోపం బుస్సున పొంగింది. కాని ఎందుకో ఆవేశాన్ని అణుచుకున్నాడు బలవంతంగా.

రైలు వేగం తగ్గుతున్నది.

"ఇవిగో వెయ్యి రూపాయలు, తీసుకో చక్రవర్తీ. నా దగ్గరవున్న మొత్తం ప్రస్తుతానికిదే!" మనోరమ డబ్బును అందించింది.

చక్రవర్తి తీసుకోలేదు. ఎర్రబడ్డ కళ్ళతో విర్లక్ష్యంగా చూసి వెళ్ళిపోయాడు బండి ఆగగానే. మనోరమ తాత్కాలిక సంభ్రమం పొందిందది.

## 2

కేశవయ్య లాన్‌లో కూర్చుని పుస్తకం చదువుకుంటున్నాడు. గేటు దగ్గర టాక్సీ హారన్ విని తల ఎత్తాడు. మనోరమ లోపలికి వస్తోంది.

ఆయన ముఖం విశాలమయింది. సంతోషంతో వెలిగాయి కళ్ళు. ఆమె రాకకోసం ఆయన కలవర పడుతున్నాడు. మనోరమ చెప్పిన రోజుకి రాలేదు. అదీ ఆయన కంగారు. ఇద్దరు నౌకర్లని హైద్రాబాద్ ప్రయాణం చేయించాడు కూడా. మనోరమ రాకతో ఆయన దిగులంతా మరచిపోయాడు.

"వచ్చావా అమ్మడూ?" ఎదురు వెళ్ళాడు.

"తాతయ్యా" చిన్నపిల్లలా ఆయన వడిలో వాలి పోయింది.

రామయ్య సూట్ కేస్ లోపలికి తీసుకుపోతూ "నీ కోసం తాతయ్యా, నేనూ కలవరించి పోతున్నాం తల్లీ. రాత్రి బండికి నేను ప్రయాణమవుతున్నాను కూడ" అన్నాడు. వాడు నౌకరే అయినా ఆ యింట్లో తరతరాల నుంచి వుంటున్నాడు. మనోరమని కేశవయ్య లాగే అభిమానంతో వాత్సల్యంతో చూడగలడు.

"మీరంతా కంగారు మనుషులు రామయ్యా!"

తన కోసం రామయ్య, కేశవయ్య, వంటమనిషి కనకమ్మ, నౌకరు కుర్రాడు సోము ఎంతగా ఎదురు చూస్తున్నారో తెలిసి మనోరమ పొంగిపోయింది. ఆ పరిసరాలు, మనుషులు, ప్రకృతి మనోరమని అంతగా ప్రేమిస్తాయి. ఆమెపై చిక్కటి మమతా వర్షం కురిపిస్తాయి. ఒక్కరోజు ఆమె యింటిలో కనిపించకపోతే, అందరూ పిచ్చెత్తిపోయినట్లు వుంటారు.

"ఒక్కరోజే కదా తాతయ్యా!" మనోరమ కేశవయ్య దగ్గర వరండాలో కూర్చుని గారం చేసింది. తక్కిన వాళ్ళంతా కూడా అక్కడే వున్నారు.

"నీ కలాగే వుంటుందమ్మా.... నీ ధైర్యం మరి మాకేది? నీలా గుండె దిటవు చేసుకుని వూర్కోలేము. అంతగా అవసరమయితే వైర్ ఇవ్వలేక పోయావా?"

"సారీ తాతయ్యా" నవ్వుతూ అపాలజీ యిచ్చింది.

"డా.... డా.... క్టరమ్మగారూ.... మీరీ సం.... సందేళ వచ్చేత్తారని రామయ్యతో పం.... పందెం కాశాను." సోము ముందరికి వచ్చి తన బోడి గుండును రాసుకుంటూ పళ్లికిలించాడు. వాడి కసలే నత్తి.

"సినిమా డబ్బు లయినా గెల్చుకున్నావా ?" మనోరమ నవ్వుతూ అడిగింది.

కేశవయ్య వారి ఉత్సాహంలో పాలుపంచుకుంటూ "కనకమ్మా.... కబుర్లు తర్వాత చెప్పవచ్చు....ముందర అమ్మడికి కాఫీ యివ్వు. ఈ నాలుగు రోజుల్లోను ఎంత చిక్కిపోయిందో చూడు" కనకమ్మని ఆదేశించాడు.

"రా.... అమ్మాయీ" కనకమ్మ లోపలికి దారితీసింది. దగ్గుతూ ఎంత ఆపుకుందామన్నా ఆగలేదు.

"ఏం పిన్నీ నీ దగ్గు మళ్ళీ వచ్చిందా?"

"డాక్టర్ని చూడగానే అన్ని రోగాలూ వస్తాయమ్మా?"

కనకమ్మ స్థానం ఆ యింట్లో వంటమనిషి. ఏళ్ళతరబడి ఆ యింటిని నమ్ముకుని వున్నందుకు పరాయి మనిషిలా కనిపించదు. కోడలు పోయినప్పటినుంచి ఆ యింట్లో ఆడదిక్కు కరువయింది. వంట విషయం రోజు రోజుకీ సమస్య అయిపోయింది, కేశవయ్య వంట మనుషులను వెతికాడు. నలుగురు ముగ్గురు కాసిని రోజులు వున్నారు. వాళ్ళ అలవాట్లు, గుణాలు కేశవయ్యకి నచ్చలేదు. ఇంతలో యింటి పౌరోహితుడు హఠాత్తుగా చనిపోయాడు. ఆ కుటుంబానికి ఏ ఆధారమూ లేదు. కనకమ్మని తమతో ఉండిపొమ్మని కేశవయ్య కోరాడు. అప్పట్నుంచి ఆమె కదే స్వంత యిల్లయింది.

రెండు రోజుల దాకా మనోరమకి కాస్తయినా తీరిక లభించలేదు. హాస్పిటల్ పని రద్దీతో ఆమె సరిగ్గా భోజనం కూడా చెయ్యలేదు. వూర్లో లేని రోజుల్లోని పనంతా ఒక్కసారి మీద పడింది.

పేషంట్లందరికీ ఆమెని చూడగానే సగంరోగం తగ్గి పోయింది. "డాక్టర్" "డాక్టర్" అంటూ ఆమెని ఒకటికి పది సార్లు పలకరించి తమ ఆనందాన్ని వ్యక్తం చేసుకున్నారు.

ఏ మాత్రం విసుగుదల చూపకుండా ప్రతి ఒక్కర్నీ ఆప్యాయంగా పలకరించింది. ఆరోగ్యాన్ని పరామర్శించింది.

మరో నాలుగు రోజులు యాంత్రికంగా గడచిపోయాయి. మనోరమ పనినుండి కాస్త తేరుకుంది.

ఓ రోజు సాయంత్రం రవుండ్సునుంచి వచ్చి ఆఫీసులో కూర్చుంది. ఏదో జ్ఞాపకం వచ్చింది. వెంటనే ఫోన్ రింగ్ చేసింది.

"లతను మాట్లాడుతున్నాను"

"నేను మనోరమని."

"నువ్వా తల్లీ, పెళ్ళినుంచి ఎప్పుడు వచ్చావ్?"

"....నీకోసం ఎదురు చూస్తున్నాను"

"అయితే అరగంటలో వస్తాను"

మనోరమ కాలక్షేపంకోసం వీక్లీ తిరగవేస్తోంది. అరగంట గడిచి పోయింది. కాని లత రాలేదు. చిరాకుగా వాచీకేసి చూసింది. అది నెమ్మదిగా పరుగుపెడుతోంది. లత మీద అంతులేని కోపం ముంచుకు వచ్చింది. ఇదెప్పుడూ యింతే. అనుకున్న టైంకి రాదు.

కాని అంతలోనే ఆమెకా భావం తొలగి పోయింది. లత మీద సానుభూతి కల్గింది. పాపం తండ్రి పోగానే లత అదృష్టం తిరగబడింది. తనలాగే ఎం. బి. చదువుదామని ఎంత సంబరపడి పోయిందో. కాని పిన తండ్రి సాగనివ్వలేదు. పెళ్ళి సంబంధాలు వెతికాడు. లత తల్లి కూడ కూతురి పెళ్ళి ముఖ్యమని తలపోసింది. లత అయిష్టంగానే ఒప్పుకుంది. కాని అది కూడ మూడు నాళ్ళ ముచ్చటే అయింది. ఏణ్ణర్థంకల్లా యాక్సిడెంటులో భర్త పోయాడు. వైవాహిక జీవితానికి సాక్షిగా బాబును మాత్రం లతకి మిగిల్చాడు భగవంతుడు. వాడిలోనే తనని చూసుకుంటూ, కాలం గడపడానికి ఏదో మందుల షాపులో పని చేస్తోంది.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్." లత వచ్చి ఎదురుగా కూర్చుంది.

"ఏం, యింత లేటయింది?"

"మా బాస్ కోసం వెయిట్ చెయ్యవల్సి వచ్చింది. అయినా నీకు తీరుబడి అయిందని నాకు కావద్దూ" లత లేచి ఫ్యాను స్విచ్చినొక్కింది.

"మంచి ఉద్యోగమే దొరికిందిలే!" అంటూ వరండాలోకి వచ్చింది. ప్యూను రంగయ్య కునికిపాట్లు పడుతున్నాడు. వాడ్ని కేకవేసింది.

"ఏం కావాలి నీకు?" లతని అడిగింది.

"వేడి వేడి యిడ్లీ, నెయ్యి కారప్పొడితో కావాలి."

నౌకర్ని హూటల్‌కి పంపించింది.

"మంగళ నువ్వు రాలేదని పదేపదే అడిగింది."

"ఏమన్నావు నువ్వు?"

"ఆవిడ సంసార చక్రంలో పడిపోయింది తల్లీ, ఇక మనం ఎవరూ గుర్తులేం. వూళ్ళోవున్న నాకే దర్శనం దొరకదు అన్నా" హాస్య పూరితంగా చెప్పింది మనోరమ.

టిపిన్ వచ్చేదాకా కులాసా కబుర్లతో గడిచిపోయింది యిద్దరికీ. ఇంతలో రంగయ్య వచ్చాడు. ఏ పొట్లం తీసుకోవాలో లతకి తెలియలేదు.

"పెద్దది నీది. చిన్నది నాది" మనోరమ తన పొట్లం తీసుకుంది.

"అదేమిటి స్వీటా?"

మనోరమ తలూపింది.

లత టిఫిన్ చేస్తూ: "ఇడ్లీ చాల బాగుంది. అయ్యరుకి శుభమగు గాక....అయినా మనో నీకు ఐరన్ టిఫిన్ అంటే యిష్టముండదంటావు. అందుకే అలా నీరసంగా కనిపిస్తున్నావు. తిండి ఎక్కువయితే ఫాట్ పెరుగుతుందని భయమా ఏమిటి?" అంది.

"అబ్బే...."

"అయినా రాజకుమారి కదా? కళ్యాణ వేదిక ముందు ఉంది. గ్లామర్ కాపాడుకోపోతే ఎలా?"

మనోరమని ఉడికించడం లతకి బాగా యిష్టం. బాధ్యత గల జీవితం గడుపుతున్న మనోరమలో యింకా పసి లక్షణాలు కొన్ని వున్నాయి. లత అటువంటి అవకాశాలని వినియోగించుకుని మనోరమని రెచ్చగొడుతుంది.

"ఇటువంటి పోకిరీ మాటల కోసం నిన్ను 'పిలవలేదు" ఉక్రోషం తొంగి చూసింది.

"మరి.... నేను మాత్రం ఏం తప్పు మాట్లాడాను? అయినా బ్రహ్మ చారిణి ముదిరినా, బెండకాయ ముదిరినా...."

మనోరమ లేచి ఆమె నోరు నొక్కి– "అమ్మమ్మలా మాట్లాడక." గదమాయించింది. నవ్వులవాన కురిసింది.

మరో పావుగంట గడిచినా లత మాట్లాడిందే ఎక్కువ. ఆమె వేళాకోళాలకు తట్టుకుంటూ మనోరమ కాలక్షేపం చేసింది.

"ఇప్పుడు చెప్పు" లత బుద్ధిగా అడిగింది.

"నీ కసి తీరిందన్నమాట."

లత వంగి ఆమెచేతిని ముద్దు పెట్టుకుని, "నీ బుంగమూతి చూడ్డం నా కెంతో యిష్టం అమ్మడూ. అందరికీ నువ్వు డాక్టరువయినా నాకు రమవే" అంది స్నేహపూర్వకంగా.

బయట సాయంకాలం సెలవు తీసుకుంది. వెన్నెలరాత్రి లోకాన్ని ఆవరించింది. వెన్నెల వెలుగులో తెల్లటి మేఘాలు, గుంపులు గుంపులుగా నవ్వుతున్న నక్షత్రాలు, స్వచ్ఛంగా కనిపించే చందమామ, అలము కుంటున్న నిశ్శబ్దం. వాతావరణం పసందుగా వుంది.

"బయట కూర్చుందాం" లత కోరింది.

పోర్టికోలో రంగయ్య కుర్చీలు వేశాడు. కొబ్బరిచెట్ల నీడలో నుంచి వెన్నెల విరిగి పడుతోంది. హాస్పిటల్ తగుమాత్రం నిశ్శబ్దంగా ఉంది. పసిపిల్ల ఏడుపు, బావి దగ్గర గిలక చప్పుడు, దూరముగా ఎడ్ల బండి చప్పుడు నిశ్శబ్దాన్ని చీలుస్తున్నాయి.

"చక్రవర్తి కనిపించాడు" మనోరమ చెప్పింది.

లతకి అర్థంకాలేదు. "ఎవరు"

మనోరమ గుర్తు చేసింది.

"నీ హృదయ చోరుడన్న మాట."

"నువ్వలా ఈజీగా వాగేస్తే క్షమించేది లేదు." కటువుగా అన్నది.

"ప్రతీ చిన్న విషయానికి యిరిటేట్ అయిపోక"

"మరి నీలా సెన్సాఫ్ హ్యూమర్ నాకు లేదు."

లత యిక హాస్యం చెయ్యనని వాగ్దానం చేసింది. తర్వాత సంగతులు చెప్పమని కోరింది. పలు విధాల బ్రతిమాలింది. ఆమె చేత పావుగంట ప్రాధేయత పొంది, చివరికి మనోరమ నోరు విప్పింది ఎలాగయితే.

"ఏమన్నాడూ" లతే చొరవగా అడిగింది.

"ఏముంది, జీవితంలో వోడిపోయి సోషల్ పెర్వర్ట్ అయ్యాడు. నా మీద చాలా ఎలర్జీవుంది. దీని కంతా కారణం నేనంటాడు."

"ఏడవలేక పోయాడు"

"అలా అనకు లతా. బాగా ఆలోచిస్తే అదే అనిపించింది, ఆ రోజు ప్రిన్సిపాల్ దగ్గరికి పోకుండా వుండవల్సింది."

"ఫాస్ట్ ఈజ్ లాస్ట్"

"అవుననుకో. అయినా వెళ్ళేదాకా నన్ను నిలవనిచ్చావా?"

"బాగుంది. తప్పు నా మీద గెంటుతున్నావా"

"ఇద్దరివల్లా జరిగింది. బంగారంలాంటి జీవితాన్ని నాశనం చేశాము."

"సెంటిమెంటల్‌గా ఆలోచించక. ఈ నాడు చక్రవర్తి చితికిపోయాడంటే దానికి కారణం అతడే. స్వయంకృతం అది. కాలేజీకి చదువుకుందుకు వచ్చాడా లేక అమ్మాయిలకి చీటీలు రాయడానికి వచ్చాడా? ఆ రోజున నువ్వా నిర్ణయం తీసుకోకపోతే నీ మీద విజృంభించి వుండేవాడు. నీ బ్రతుకు నాశనమయ్యేది. యు ఆర్ డామ్ లక్కీ గరల్. దానికి సంతోషించు"

లత వాదన మనోరమ ఎంతమాత్రమూ సమర్థించలేక పోయింది. మనోరమ అంతరాంతరాల్లో "యిది తప్పు" అంటూ సుడి గుండాలు తిరుగుతోంది. చక్రవర్తి కనిపించి నప్పటినుండి రిపెంటెన్సు ఎక్కువయి పోయింది. చక్రవర్తి విడిచే ప్రతి కన్నీటి బొట్టుకి కారణం తనే, తనవల్లే అతడు నష్టపోయాడు. ఈ రకం బాధ మనోరమకి ఎక్కువయిపోయింది. దానియొక్క పీడనానికి ఆమె తట్టుకోలేక పోయింది. లతని పిలిపించి తన హృదయాన్ని ముందు పరచుకున్నది యిందుకే. కాని ఆమె దగ్గరనుంచి తను ఆశించిన సమాధానం రాలేదు.

"మరీ ఫూలిష్‌గా ఆలోచించకు మనో. నీది మెత్తటి హృదయం. కనుక పనికిరాని సంగతిని పదేపదే ఆలోచిస్తున్నావు. మరొకరయితే చక్రవర్తి పతనానికి నిండుగా సంతోషించేవారు. అయినా ప్రతిదానికీ యింత చలించిపోతే ఎలా?"

మనోరమ మాట్లాడకుండా ఆలోచిస్తున్నది.

"ప్రస్తుతం జేబులు కత్తిరిస్తున్నాడుట?" లత అడిగింది.

తలూపింది మనోరమ.

"ఒక రకం పతనం అన్నింటినీ ఆహ్వానిస్తుంది. మంచో, చెడో జరిగిన దానితో సరిపెట్టుకుని జీవితాన్ని స్థిరం చేసుకోగలిగాడా? లేదు. తప్పుమీద తప్పు చేస్తూ ఖరాబుచేసుకున్నాడు. దానికి బాధ్యుడు అతడే." నిర్ధారణ చేసింది లత.

"జర్నీలో కనిపించి మెంటల్‌గా వర్రీ కలిగించాడు. నా వల్ల ఎవరయినా యిబ్బంది పడుతున్నారంటే నేను సహించలేను!"

"అటు–ఇటు పోవాలి మనో. జీవహింస పాపమే. కరవడానికి వస్తున్న పాముపై కర్ర ఎత్తకపోతే ఎలా? చక్రవర్తి దౌష్ట్యంనుంచి నువ్వు ఎదిరించి తప్పుకున్నావు. ఆ పాపాన్ని అతడ్ని అనుభవించనియ్."

లత సాహసి. అందుకే వేగమైన నిర్ణయానికి రాగలిగింది. నిర్లక్ష్యంగా కొట్టిపారెయ్యగలిగింది. సంఘటనలనుంచి తనని రక్షించుకుందుకు కొందరు తెగ తాపత్రయపడి పోతారు. ఏదోలా నెపం అవతలికి విసిరేస్తారు. మానవత్వ విలువలతో ఆ సంఘటనని కొలిచినపుడు ఆ వ్యక్తి పూర్వకంగా న్యాయం కలిగించలేము. జరిగిపోయిన తప్పులో తన వాటా ప్రత్యక్షంగా ఏమీ లేదు. చక్రవర్తి మీద తాను ఆత్మరక్షణార్థం బుస కొట్టింది. తద్వారా తను రక్షణ పొంది ఎంతో ఉన్నతపథం పొందగలిగింది. ఆ మేరకు చక్రవర్తి పాము నోటిలో పడిపోయాడు. ఒకే పరిస్థితి తనకి నిచ్చెన, అతడికి పాముని యిచ్చింది.

ఇంటికి వెళుతున్నప్పుడు కారులో అంది లత? "ఫర్‌గెటిట్ మనో.. ఇదేం పెద్ద ప్రాబ్లం కాదు. నిత్యం వృత్తిధర్మంగా ఎన్నో ట్రాజడీలు

చూస్తూన్నావు. ఇలా బేలవయితే నీ వృత్తికే అవమానం. బాగాఆలోచించు."

లత యిల్లు వచ్చింది.

లత యింట్లోకి దారితీస్తూ .... "లోపలికిరా.... బాబుని చూసి చాల రోజులైనది గదా!" అంది.

"తర్వాత వస్తాలే .... ఛీర్స్" కారు ముందుకు పోయింది.

మనోరమ ఆ రాత్రి భోజనం కూడా సరిగ్గా చెయ్యలేదు. కనకమ్మకి తనకేం అవలేదని చెప్పడం బ్రహ్మండమైంది.

ప్రతీ రాత్రి భోజన మవగానే కేశవయ్యతో కబుర్లు చెప్పడం అల వాటు. కబుర్లు ఆడుతూనే ముసలాయన నిద్రపోతాడు. ఆ రోజు మనోరమ భోజనమయిన వెంటనే మేడఎక్కేసింది? తాతయ్య విషయం మరిచి పోయింది.

రామయ్య వచ్చాడు. "తాతయ్య పిలుస్తున్నారమ్మా."

మనోరమ వక్కపొడి నములుతూ అప్పుడే కూర్చుంది బద్ధకంగా. తాతయ్య సంగతి జ్ఞాపకం వచ్చింది.

"ఏదో కేసు రిఫర్ చేస్తున్నానని చెప్పు రామయ్యా."

రామయ్య వచ్చి కుర్చీదగ్గర కూర్చున్నాడు "అదోలా వున్నావేమిటి అమ్మడూ, ఆరోగ్యం బాగుందా" అంటూ చెయ్యి పట్టుకు చూశాడు. నాడి చూడటం వచ్చు."

ఆ వాత్సల్యం ఆమెకిష్టమయినా ప్రస్తుతం ఆమె కోరుకునేది ఏకాంతం "నాకేం కాలేదు రామయ్యా, దుంగలావున్నాను."

రామయ్య నొచ్చుకుంటూ. "ఛ. ఛ.... అవేం మాటలు తల్లీ. ఈ ఆసుపత్రి పనితో నీవు సగమయిపోయావు." అభిమానం కురిపించాడు.

త్రిశంకు స్వర్గం ఏమిటో మనోరమకి అర్థంఅయింది. ఇటు తను ఆశిస్తున్న ఒంటరితనమూ లభించడం లేదు. పోనీ రామయ్యాని కసిరి పొమ్మనడం తనకి చేతకాదు. తాతయ్య కూడా రామయ్యాని ఏమీ అనడు. ఎంతో నమ్మకం కూడా. అంతటి వ్యక్తిపై చిరాకు ప్రదర్శించడం కష్టమే మరి. సందిగ్ధంగా కూర్చుని నిస్సహాయతని తిట్టుకుంది.

పావుగంటలో రామయ్య వెళ్ళి పోయాడు.

"అభిమానం ఎక్కువయినా కష్టమే" అనుకుంది.

నిద్రకూడా రాలేదు ఆమెకి. ఎంత ప్రయత్నించినా రెప్పలు వాలలేదు. నిశ్శబ్దంగా వున్న ప్రకృతిని చూస్తూ కిటికీ దగ్గర నిలబడింది.

చెట్లు భారంగా నిలబడి వున్నాయి. రోడ్డు నిర్మానుష్యంగా వుంది. రాత్రి యొక్క మత్తులో జనం పడిపోయారు.

దెబ్బతిన్న వ్యక్తి చాల ప్రమాదమైనవాడు. మనసులో ఆ గాయం నిత్యం పెరుగుతూవుంటుంది. అది దానియొక్క తీవ్రతని బట్టి పెరిగి పెద్దదవుతూ, పగగా మారుతుంది. ఏదో విధంగా పగ తీర్చుకోవాలన్న పట్టుదల కల్గుతుంది. తను చక్రవర్తిని సానుభూతిగా ఆలోచిస్తున్నది. మరి అతడు ?

కోపంతో బుసలు కొడుతూ వుంటాడు. ఇన్నాళ్ళనుంచి తన మీద కసి తీర్చుకోవడానికి ప్రయత్నిస్తూ వుండి ఉండవచ్చు.

మరి రైలులో అతడెందుకు ప్రయత్నించలేదు ?

ఈ ప్రశ్నతో ఆమె ఆలోచనలన్నీ తెగిపోయాయి. ఆ వేళ తను వంటరిగా వుంది. మంచి అవకాశం, కాని చక్రవర్తి ఉపయోగించుకోలేదు. తను దబ్బిస్తున్నా తిరస్కరించాడు. అతడి కా ఉద్దేశ్యం లేదేమో. తను నెర్వస్‌గా ఆలోచిస్తున్నది. వృధాగా భయపడుతున్నది. అసలే తనకి ఆలో

చనల్లు ఎక్కువ. ప్రతిదాన్నీ శల్య పరీక్ష చేస్తుంది. నీచమైన జీవితం గడుపు తున్న చక్రవర్తి కూడ తనకంటే ప్రశాంతంగా వుండగలడు.

అయినా చక్రవర్తిని గురించి తను ఎందుకు ఆలోచిస్తున్నది?

జవాబు లేదు. రాలేదు.

నిద్ర వచ్చేసింది.

మర్నాడు మనోరమ లేచేసరికి ఎనిమిది గంటల పొద్దు ఎక్కింది. అప్పటికే ఇంట్లో వాళ్ళందరూ కనీసం డజనుసార్లు మేడ ఎక్కారు.

మనోరమ హాస్పిటల్‌కి తయారయ్యేసరికి తొమ్మిదయింది.

పూజ పూర్తయి కేశవయ్య హాల్లోకి వచ్చాడు. మనోరమ కూడా అక్కడే వుంది. ఇద్దరికీ కనకమ్మ టిఫిన్ పట్టుకు వచ్చింది.

"నీ కోసం నర్సు ఫోన్ చేసింది." కేశవయ్య చెప్పాడు.

"ఎమర్జెన్సీ ఏమైనా వుందా?"

"ఏం లేదమ్మా!"

"లేటయి పోయింది."

ఇంతలో కనకమ్మ కాఫీలు తీసుకువచ్చింది. "నీ గురించి నాకూ లేటయింది."

ప్రతీరోజూ యిద్దరూ కల్సి టిఫిన్ చేస్తేనే కాని వారికి తిన్నట్లు వుండదు. మనోరమ రాకుండా కేశవయ్య టిఫిన్ చెయ్యడు.

"నా కోసం నువ్వు మానెయ్యడం ఎందుకు తాతయ్యా?"

"నాకు లేటయినా ఫర్వాలేదమ్మా. బట్టల కొట్టే కదా.... అంత ప్రొద్దుటే రష్ వుండదు. అయినా గుమస్తాలు వున్నారు కదా!"

కేశవయ్య ఏదో మాట్లాడాలని ఏదో మాట్లాడుతున్నాడు. ఆయన మాట్లాడాలనుకున్నది లోపలే వుండి పోయింది.

ఈత రానివాడికి నీళ్ళంటే భయం వేస్తుంది. కేశవయ్యకి చాలా కాలం నుంచి మనవరాలి పెళ్ళి చేయాలని వుంది. ఆమెను యింటిదాన్ని చేసి తన బాధ్యత పూర్తిగా వదిలించుకోవాలని ఆయన తాపత్రయం. కాని మనోరమ మీద ప్రేమ, అభిమానం హెచ్చు. దాని ద్వారా కఠినత్వాన్ని ఆయన తెచ్చుకోలేకపోతున్నాడు. అందుచేతనే మనోరమ ముందు ఆయన ప్రతిసారీ ఓడిపోతూనే వున్నాడు. తనకయిష్టమైనా మనోరమ మెడిసిన్ చదవడానికి ప్రాక్టీసు చెయ్యడానికి ఒప్పుకున్నాడు.

కుటుంబ పెద్దగా కేశవయ్య రాణించాడనే చెప్పాలి. అటు కృష్ణ మూర్తి, మాధవీ, యిటు మనోరమ ఆయన్ని ఎంతగానో అభిమానిస్తారు. పెద్దరికం వహించే వ్యక్తి శాసించే ధోరణివల్ల ఆ కుటుంబానికి అయిష్టుడయి పోతాడు. లేదా ద్వేషింపబడతాడు. తరాల అంతరాలు సంసారంలో తప్ప కుండా కలతలు రేపుతాయి. వాటి నుంచి తప్పుకోడానికి ప్రాతినిధ్యం వహిస్తున్న వ్యక్తి తెలివితేటలు చూపించవలసి వస్తుంది. తన జీవితం, అది నేర్చుకున్న పాఠాలు, ఆ కాలం వేరు. తను గైడ్‌గా నిలబడిన పరిస్థితి వేరు. రెంటికీ పోలికలున్నా వ్యత్యాసాలు కూడా చాలా వుంటాయి.

కేశవయ్య రాజీ పడిపోయాడన్నది యదార్థం. అందుకు ఆయనేం బాధపడడు. కుటుంబంలో శాంతి, సామరస్యం కనిపించాయి. ఆరు పదులు నిండిన కేశవయ్య తన వోటమికి ఏమీ చింతించడు. చల్లారిపోయిన పాలు తనవి. ఎలాగయినా సరిపెట్టుకుంటాడు. వాళ్ళు యింకా చిన్న పిల్లల వూహల్లో వుంటారు. ఆ వయస్సు యొక్క ఉద్విగ్నత వల్ల పౌరుషాలు. పట్టుదలలు వుంటాయి. రెండు చేతులు కలిపితే చప్పట్లు. కుటుంబం రణ

రంగమవుతుంది. ఆ వైపు పయనించకుండా కేశవయ్య జాగ్రత్త పడ్డాడు. తన సిద్ధాంతాలు, నమ్మకాలు, కోరికలు తనలోనే పెంచుకున్నాడు.

"రాజమండ్రి సంబంధం అన్ని విధాలా బాగుందమ్మా" కేశవయ్య చిట్ట చివరికి తన భావాన్ని బయట పెట్టాడు.

ఇన్ని రోజులు కేశవయ్య ఆమె పెళ్ళికోసం ఆగడానికి మరో కారణముంది. మనోరమకి అదృష్టవశాత్తు డబ్బు, అందం, చదువు అంతస్థు అన్నీ వున్నాయి. ఆమెకి చేసే సంబంధంలో కూడ యివన్నీ వుండాలి. లేకపోతే మనోరమ సంసార జీవితం గాలివానలోని పడవలా వుంటుంది. ఇన్నేళ్ళ నుంచి కేశవయ్య అదే ప్రయత్నంలో వున్నాడు. ఆ నిరీక్షణ కార్యరూపంలోకి వచ్చింది.

"అలాగే తాతయ్యా" అంది మనోరమ లేస్తూ.

దానర్థం ఏమిటో తెలియలేదు.

"నీ పెళ్లికి, నా తీర్థయాత్రలకి సంబంధం వుందమ్మా."

"భలే.... అయితే పొడిగించేస్తాను"

"అంతపని చెయ్యకమ్మడూ"

మనోరమ పోయి కారులో కూర్చుంది. కేశవయ్య వరండా చివరి దాకా వెళ్లి "ఏం రాయనమ్మా అనడిగాడు."

"ఏం వద్దు తాతయ్యా!"

* * * *

ఆ రోజు మనోరమ కేసులు లేకపోవడం వల్ల ఆరున్నరకే ఇంటికి వచ్చేసింది. ఆమె వచ్చినప్పటినుంచి కుండపోత వాన. ఆకాశం గర్జిస్తూ కన్నీరు కారుస్తోంది.

బట్టలు మార్చుకుని వేడి వేడి టీ త్రాగుతూ హాల్లో కూర్చుని వీక్లీ తిరగవేస్తోంది. కేశవయ్య జ్వరపడి ఆరోజు పత్యం తిన్నాడు. రామయ్యా, సోము గుమ్మంలో కూర్చుని పులి – మేక ఆడుకుంటున్నారు. కనకమ్మ వంటింటిలో వుంది.

ఫోన్ మ్రోగింది ఇంతలో....

"ఎవరో చూడ్రా" సోముని కేకేసింది.

"పెద్దాసుపత్రి అమ్మగారూ"....

మనోరమ ఆశ్చర్యంగా ఫోన్ అందుకున్నది. "యాక్సిడెంటా"

"అవునమ్మా. డైరీలో చక్రవర్తి అనివుంది. డేట్ కాలంలో మిమ్మల్ని మీట్ అవ్వాలని రాసివుంది. మీ పరియస్థులని తెలియపరచాం."

"థాంక్స్. ఎలా వుంది."

"సీరియస్సే. థియేటర్‌లోకి వెళ్ళింది. కేసు చీఫ్ స్వయంగా టేక్ అప్ చేశారు."

"అలాగా. మెనీ మెనీ థాంక్స్. నేను బయలుదేరి వస్తున్నాను."

మనోరమ ఫోన్ క్రెడిల్ మీద వుంచి గుమ్మం దాకా వెళ్ళింది. వాన జోరుగానే కురుస్తోంది. తగ్గే వాతావరణం ఏమీ లేదు. ఇటువంటి సందర్భంలో బయటికి వెళ్లాలంటే కష్టమే. మనోరమ తటపటాయించింది.

"వెళ్లాలా అమ్మా" కేశవయ్య అడిగాడు. ఆయన కంఠంతో అయిష్టత తొంగి చూస్తోంది. వాతావరణం పాడుగా వుంది. ఈ పరిస్థితిలో గుమ్మం కదలటం సాహసమే మరి. పైగా ఆడపిల్ల ఈ పరిస్థితిలో అవస్థపడుతుందని కేశవయ్య ఉద్దేశ్యం. మనోరమ తలూపి పైకి వెళ్ళిపోయింది.

డాక్టరు వృత్తి గడియారం వంటిది. విశ్రాంతి ఆశించకుండా తిరిగే

యంత్రం. బద్ధకించడం వృత్తికే అవమానం. మనోరమ మొదటినుంచి కూడా వృత్తి యెడ విపరీతమైన శ్రద్ధ కనపరుస్తూనే వుంది. స్వసుఖాలని త్యాగం చేస్తేనే కాని తను చేపట్టిన వృత్తికి న్యాయం కలుగచెయ్యలేనని ఆమె భావించి తదనుగుణంగా నడుచుకోవడం వల్లనే మంచి పేరు ప్రతిష్ఠలు సంపాదించుకుంది. తను ఏర్పరచుకున్న క్రమశిక్షణ ఆమెకి సరయిన ప్రతి ఫలం యిచ్చింది.

మనోరమ రెయిన్‌కోట్ వేసుకుని క్రిందికి వచ్చింది. కేశవయ్య వీధి వరండాలో వున్నాడు. "అమ్మడూ, రిక్షా వచ్చింది".

"కారు వున్నది కదా!"

కేశవయ్య ఒప్పుకోలేదు. "డ్రయివర్ లేడు. ఈ వానలో నీవు డ్రయివ్ చెయ్యడం నా కిష్టం లేదమ్మాయ్."

రిక్షా వానలో బరువుగా నడిచింది. వాన ఉధృతంగా వురుములతో కురుస్తోంది. చెట్లు భయంకరంగా వూగుతున్నాయి. రోడ్లు నదుల్లా వున్నాయి. ప్రకృతి చేస్తున్న బీభత్సంవల్ల రోడ్లు సందడి కోల్పోయాయి. వీధి దీపాలు నామమాత్రంగా వెల్గుతున్నాయి.

రిక్షా హాస్పిటల్‌కి చేరుకుంది.

దీపాలు అక్కడక్కడ వెలుగుతున్నాయి. హాస్పిటల్ ఆవరణలో లైట్లు లేవు. వానకి మర్రిచెట్ల మీద ఏవో పక్షులు కిచకిచ మంటున్నాయి. డెత్ చాంబర్ దగ్గర ఏడుపులు వినిపిస్తున్నాయి. ఏదో కేసు ఫెయిల్ అయి నట్లుంది. తోటీలు శవాన్ని లాక్కుపోతున్నారు. మనోరమ ఎంక్వయిరీస్‌లోకి వెళ్ళింది.

గుమస్తా కునికిపాట్లు పడుతున్నాడు. మనోరమని చూచి బద్ధకంగా లేచాడు. "రండి.... మేడమ్...." నిద్రమత్తు అతని కళ్ళలో కనిపిస్తోంది.

మనోరమకి వివరాలు చెబుతూ "థర్డ్ స్టెయిర్, రూం నెంబరు ట్వంటీ సెవన్. ఇప్పుడే సర్జరీ అయింది. క్వయిట్ వో. కె." అన్నాడు.

నర్సు అప్పుడే ఇంజక్షను చేసి బయటికి వస్తోంది. మనోరమని చూచి చిరునవ్వు నవ్వింది. "కమాన్ డాక్టర్."

"హవ్ యీస్ హి" లోపలికి తొంగిచూసింది.

"మైనర్"

చక్రవర్తి ప్రశాంతంగా నిద్రపోతున్నాడు.

*   *   *   *

"ఎలా వుంది"

"ఫరవాలేదు"

"కదలక"

మనోరమ తాను తెచ్చిన పళ్ళు, బిస్కట్లు స్టూలుమీద పెట్టింది. చక్రవర్తికి దాదాపు నయమయింది. మనిషి చాలా ఈజీగా కనిపిస్తున్నాడు. మనోరమ చూడటానికి రావడం అతడికి చాలా సంతోషంగా వుంది. ఈ వారం రోజులుగా ఆమె రోజూ వస్తోంది. ఇది చక్రవర్తికి చాల బాగుంది.

"కూర్చో"

మనోరమ కుర్చీలాక్కొని కూర్చుంది. లోషన్‌తో గది కడగటం వల్ల శుభ్రంగా ఘాటుగా వుంది. మనోరమ రాక పూర్వం అతడు ఏదో మాగజైను చూస్తున్నాడు. దాన్ని మడచి మనోరమ వైపు తిరిగాడు. ఎడం కాలుకి మాత్రం బాండేజీ వుంది.

"ఇంకా ఎన్నాళ్లుండాలి?"

చక్రవర్తి నవ్వాడు "అది మీ డాక్టర్ల యిష్టం."

అందులో కృతజ్ఞత తొంగి చూసింది. మనోరమ స్వయంగా చూడటానికి రావడం, స్పెషల్‌గా ట్రీట్‌మెంటు కలుగజేయడం, స్నేహంగా మాట్లాడటం చక్రవర్తికి ఆశ్చర్యం కలుగజేస్తున్నాయి. ఈ మాత్రంలో తను బాగుపడటానికి మనోరమే కారణం.

"నీకు థాంక్సు చెప్పుకోవడం నా కనీస ధర్మం మనోరమా.... నువ్వు స్వయంగా కలుగజేసుకుని నాకు పునర్జన్మ ప్రసాదించావు. నా విషయం నీకెలా తెల్సింది?"

"నీకేం తెలియదా?"

చక్రవర్తి తలూపాడు.

"మరి నీ డైరీలో ఎవరు రాశారు?" ఎదురు ప్రశ్నించింది.

చక్రవర్తి మూగవోయాడు. అన్నీ గుర్తువస్తున్నాయి. మనోరమని కల్సుకుందామని ప్రయత్నం. అంతా వేరుగా జరిగిపోయింది.

"ఒకటి అడుగుతాను నిజం చెబుతావా?" మనోరమ అడిగింది.

"అబద్ధం చెప్పను."

"నీకు జరిగింది యాక్సిడెంట్ అంటావా?"

"గమనించావు."

"ఏం జరిగింది?"

చక్రవర్తి అంతా చెప్పాడు. రైల్లో దొంగతనం చేస్తున్నాడు. ఇంతలో ఎవరో చూశారు. పట్టుబడకుండా క్రిందకి ఉరికేశాడు. ఎవరో తెచ్చి హాస్పిటల్లో పడేశారు.

"మనోరమ సానుభూతిగా అర్థం చేసుకున్నది. ఎంత ప్రమాదంగా జీవిస్తున్నాడు చక్రవర్తి? అడుగుకో ఆపద. క్షణక్షణ గండం. ఈ రద్దీ జీవితంలో ఏం సాధిస్తాడు? శాంతిహీనంగా ఎలా బ్రతుకుతున్నాడు? ఏమిటిందులోని తృప్తి?"

"నువ్వు ఎన్నుకున్న జీవితం నీకిచ్చిన బహుమానం చూశావా?"

చక్రవర్తి నెమ్మదిగా లేచికూర్చున్నాడు. అతడి ముఖం సీరియస్‌గా వుంది. "నా కిందులో విచిత్రం ఏమీ కనిపించలేదు మనోరమా. మీ తాతయ్య బట్టల వర్తకం చేస్తున్నాడు. నువ్వు వైద్యం చేస్తున్నావు. నేను దొంగతనం చేస్తున్నాను. మన అందరి లక్ష్యాలు ఒక్కటే. డబ్బు సంపాదించడం. ప్రమాదాలు జరిగితేనే జీవితంలో ఆనందం. లేకపోతే థ్రిల్ ఏముంది చెప్పు?"

"లక్ష్యం ఒకటే అయినా, లక్షణం మాత్రం లేదు. సమాజానికి వ్యతిరేకంగా నిలబడటం మంచిది కాదు చక్రవర్తీ...."

ఈ విధంగా ఇరువురి మధ్య వాదోపవాదాలు నిత్యం జరుగుతూనే వున్నాయి. ఇంతలో డిశ్చార్జి చేసే రోజు వచ్చింది.

"నీకింకా కొన్నాళ్ళు విశ్రాంతి అవసరం" అన్నది మనోరమ.

"మీ డాక్టర్ల మాటే యింత."

"అర్థం చేసుకోమరి. కొన్నాళ్ళు నా నర్సింగ్ హోంలో వుండు."

"ఇక నీ వైద్యమా?"

"వైద్యం ఏమీ లేదు. విశ్రాంతి."

"ఆల్ రైట్"

చక్రవర్తి నర్సింగ్ హోంకి వచ్చినట్లు తెల్సింది లతకి. ఆ సాయంత్రం ఆమె హాస్పిటల్‌కి వచ్చింది.

మనోరమ డెలివరీ కేసుకి అటండ్ అయి, అప్పుడే వచ్చి చేతులు కడుగుతోంది. లతని చూసి "రావే .... హఠాత్ దర్శనం." ఆహ్వానించింది.

"దొంగగారు ఇక్కడే వున్నారుట." వ్యంగ్యంగా అడిగింది.

మనోరమకి అర్థం అయింది. కాని లత సంభాషణ తీరు రుచించ లేదు. కాని ఆ భావాన్ని బయటపెట్టకుండా, "దొంగయినా, దొరయినా మనకి అనవసరం. అతను రోగి. నేను డాక్టరు. కేవలం మానవత్వం విలువ లతో నేనీ పనిచేశాను." అంటూ వచ్చి కూర్చుంది.

"అంతేనంటావా ?" లత సాగదీసింది.

"ఏమిటే నీ తల తిరుగుడు ? వంట్లో బాగా లేదా ?" నవ్వుతూ కోప్పడింది.

లత లేచి నిలబడింది, "ఆల్ రైట్. నేను నీతో పోట్లాడడానికి రాలేదు. రేపు బాబు పుట్టినరోజు పార్టీకి రా."

"తప్పకుండా. మరి అసలు విషయం చెప్పవేం ?"

"దానికంటే హాటు వార్త వుంది కదా ?"

లత వెళ్ళే ముందు చక్రవర్తి గదికి దారి తీసింది. వెంట మనోరమ కూడ వుంది. "బాగ్దాద్ కుశలమా ?" లత సెటైరికల్‌గా నవ్వింది.

చక్రవర్తి డైలీ తిరగెయ్యటం ఆపి, ఇద్దర్నీ చూశాడు.

"లత" పరిచయం చేసింది.

ఏదో జ్ఞాపకం వచ్చినట్లు తల ఆడించాడు చక్రవర్తి.

"ఎడ్వెంచర్ ఎలా వుంది ?" మరల ప్రశ్నించింది.

"హాస్పిటల్ చూశానంటోంది."

"ఇంకా ఏం చూడాలంటోంది? జైలా?"

"అది ఇంతకు ముందే అయింది"

చక్రవర్తి అంటే లతకున్న అసహ్యం బహిర్గతమయింది. కాలేజీలో చదువుతున్నప్పుడు చక్రవర్తి చెయ్యబోయే అత్యాచారం గుర్తుకు వచ్చి ఆమె కోపం ద్విగుణీకృతమైంది. సహజంగా చక్రవర్తి ఏ మాత్రం లతకి చెరుపు చెయ్యలేదు. తను మనోరమకి స్నేహితురాలు. అంతే, కాని చిల్లరగా బ్రతికే వాళ్ళని చూస్తే లోకువ కలుగుతుంది. చక్రవర్తి అతినీచంగా బ్రతుకుతున్నాడు. అటువంటి వ్యక్తిని, గతాన్ని మరచిపోయి మనోరమ సానుభూతి చూపడం ఆమె కిష్టంలేదు. అందుకే చక్రవర్తిని హేళనగా ప్రశ్నించింది.

లత వెళ్ళిపోగానే అడిగాడు. "ఆమె మారలేదు."

"కొంతమందిలోని మార్పు సులభంగా కనిపించదు. ఏదో సరదాగా మాట్లాడి వుంటుంది. ఏం వర్రీ కాక" మనోరమ బయటికి వచ్చేసింది.

లత ప్రశ్నలు అంతరంగంలో మెదులుతున్నాయి. సమాధానాలు కనిపించడంలేదు. ఈ సంచలనంవల్ల భారం ఎక్కువయింది.

కాఫీ తెప్పించుకుని త్రాగింది.

చక్రవర్తి మీద తానింత సానుభూతి ఎలా వ్యక్తం చేయగల్గుతోంది? అతడు తనకి అపకారం చేశాడు. తను ఉపకారం చేసింది. ఇది సంభవమా? మానవ బలహీనతలపరంగా ఇది గొప్పదే! తను ఇంత పైకి ఎలా ఎదగ గలిగింది? ఎటువంటి సంపర్కము లేని లత మండిపడింది. తద్విరుద్ధంగా పూర్తిగా బాధ్యతకల తాను చేరదీసింది. ఆపదలో సాయంచేసింది.

మనోరమ చాల సేపు ఆలోచించింది.

అతడు పతనమయ్యాడు. అన్నివిధాలా చితికిపోయాడు. ఇందుకు

తాను పరోక్షంగా కారణం కావచ్చు. దాని పరిహారంగా ఈనాడు సేవలు చేసింది. మనోరమ కీ వూహే బలం యిచ్చింది.

అదే తన ప్రశ్నకు సమాధానం ఇచ్చుకుంది.

రోజులు గడిచిపోతున్నాయి. చక్రవర్తి పరిపూర్ణ ఆరోగ్యవంతుడయ్యాడు. బలం కోసం ఆమె చాల ఖరీదైన మందులు వాడింది. పాలు, వెన్న, క్రీం బిస్కట్లు, ఆపిల్స్....ఒకటేమిటి, అతడు త్వరితగతిని కోలుకోడానికి వీలైనన్ని సదుపాయాలు చేసింది.

చక్రవర్తి వీటితో పూర్తి మనిషయిపోయాడు. పూర్వం కంటే బలంగా తయారయ్యాడు.

"నన్ను పూర్తిగా మార్చేశావ్" వో రోజు మధ్యాన్నం చక్రవర్తి భోజనం చేస్తూ అన్నాడు. మనోరమ రవుండ్సు పూర్తి చేసుకుని అప్పుడే వచ్చింది.

అతడికి భోజనం రోజూ ఇంటి దగ్గరనుంచే వస్తోంది. మనోరమ ఏర్పాటు స్వయంగా చేసింది. కనకమ్మకిది అలవాటే. పేషెంట్లకి రామయ్య ద్వారా అప్పుడప్పుడు పంపుతూ వుండటం వల్ల ఆమె కేం అనుమానం రాలేదు. చక్రవర్తి విషయం ఆమెకి చెబుదామని ఉన్నా మనోరమ చెప్ప లేకపోయింది.

"ఫిజికల్ ఆర్ మెంటల్?" మనోరమ కుర్చీలో కూర్చుంది.

ఎదురుగా చక్రవర్తి భోజనం చేస్తున్నాడు. "వోన్లీ ఫిజికల్!"

మనోరమ వాచీ చూసుకుంది. పన్నెండున్నర. భోజనం వేళయింది. ఆకలి కూడా బాగా వేస్తోంది. ఇంటికి వెళ్లేముందు ఒకసారి చూడటానికి వచ్చింది అలవాటుగా.

చక్రవర్తి భోజనం ముగించాడు. టవల్‌తో తుడుచుకుంటూ బయటికి వచ్చాడు.

"నేను రేపు బయలుదేరుతున్నాను."

ఉలిక్కిపడింది ఆమె. "ఎక్కడికి?"

"రోలింగ్ స్టోన్ హేజ్ నో మాస్. జనం ఎక్కడ పచ్చగా, అజాగ్రత్తగా వుంటారో అదే నా వూరు. ఇంతకంటే స్పష్టంగా నేను చెప్పలేను."

"అంటే పాత దారేనన్నమాట."

"అలవాటు మానెయ్యడం కష్టం"

మనోరమ కోపంగా "నీకు సిగ్గులేదా? పైగా దొంగతనాలు చెయ్యడం ఏమంత ఘనకార్యం. నలుగురూ 'ఛీ' అంటారు. సంఘంలో చివాట్లు తింటూ బ్రతకటం ఏం బాగు. బాగా ఆలోచించుకో చక్రవర్తీ! ప్రశాంతంగా ఆలోచిస్తే నీకే తెలుస్తుంది" అంది.

చక్రవర్తి సిగరెట్టు వెలిగించాడు. "ఉపన్యాసాలు చెప్పడం చాల సులభం మనోరమా! సగటు మనిషి దగ్గర్నుంచి న్యాయస్థానందాకా దొంగతనం తప్పంటారు. నీతులు చెబుతారు. పట్టుబడితే జైలు. అయిదారు నెలలు ఆ గోడలమధ్య వుంచి వదిలేస్తారు. కాని నేరానికిది శిక్ష. ఈ పడిన శిక్ష సరయిన దారి చూపించలేదు. మళ్ళీ దొంగతనం చెయ్యడం తప్పనిసరి. ఇదే ఒక విషవలయం. ఒకసారి అడుగు వేస్తే తప్పించుకుని రావడం అసంభవం."

"ఉద్దేశముంటే ఉపాయముంటుంది."

"నీ జీవితం పడ్డించిన విస్తరి మనోరమా. నీకు సంఘం యొక్క క్రూరత్వం తెలియదు. సంఘం యొక్క ఇనుప సంకెళ్ళ రాపిడి నీకు అర్థం

కాదు. దొంగముద్ర పడినదాన్ని చెరుపుకోవడం అసంభవం. ఎంత మంచిగా ఉన్నా దొంగ దొంగే. మారడానికి అవకాశం లేదు. పది మంది పదిరాళ్ళు విసురుతారు. అన్ని విధాల బాధలు పడాలి. ఎందుకు ఇదంతా? హాయిగా 'దొంగ' లాగే వుండిపోతే మంచిది. పట్టుపడేదాకా బాధ లేదు."

చక్రవర్తి కంఠం స్థిరంగా వుంది. పాత జీవితాన్ని సమర్థించడం కనిపిస్తుంది. ఇది విని మనోరమ చప్పున లేచింది.

"అలా వీల్లేదు."

"ఏం?"

"నువ్వు దొంగలా వుండిపోవటం నా కిష్టం లేదు. నీ ఆరోగ్యం బాగుచెయ్యడానికి నేనెంత బాధ్యత వహించానో తెల్సు. అలాగే ఇందులో కూడా నేను సాధిస్తాను. గాడి తప్పిన నిన్ను దారిలో పెట్టడం నా ముఖ్యమైన కర్తవ్యం."

చక్రవర్తి చప్పట్లు కొట్టాడు. "నీ ఉత్సాహాన్ని అభినందిస్తున్నాను."

"నీ కోపరేషన్ ఉండాలి కదా!"

"నిజమే."

చక్రవర్తి కాస్సేపు మాట్లాడలేదు. మనోరమ ధోరణి అతడ్ని ఆశ్చర్య పరుస్తోంది. ఇన్నాళ్ళ చాల నిర్లక్ష్యంగా బ్రతికాడు. ఏకాకిగా జీవించాడు. మమతలు పంచుకునే మనుష్యులు లేక ఇష్టం వచ్చినట్లు నడిచాడు. ప్రతి చిన్న విషయానికి, పెద్ద విషయానికి స్వయం నిర్ణయమే. ఇది మంచీ చెడ్డా వివరించేవాళ్ళు లేరు. స్నేహితులు ఉన్నా వాళ్ళు అవకాశవాదులు. ఈ ఏకాంతం చక్రవర్తి మీద చాల దెబ్బతీసింది. తను ఒంటరిగాడు.

ఎవరూ లేరు. ఏమయిపోయినా ఎవరికీ అక్కరలేదు. దొంగయితే నేం? హంతకుడయితే నేం? బ్రతికినన్నాళ్ళు సుఖంగ బ్రతకడం కావల్సింది. అందుకే చక్రవర్తి దొంగగా మిగిలిపోయాడు. గతాన్ని ఎన్నడూ అతడు పరిశోధించి చూసుకోలేదు.

"వద్దు మనోరమా. నీ స్నేహానికి నా అభినందనలు. నా బ్రతుకు ఎలా ఖరాబయినా ఫర్వాలేదు. ఎలాంటి విషాదం ఒలికినా 'అయ్యో' అన డానికి ఎవరూ లేరు. నా బాగు ఎవరికి కావాలి, నేను మంచిగా వుంటే సంతోషించే వారెవరు? నా సంస్కరణకి ఆనందించే వారెవరు?" దుఃఖంతో గాద్గదిక మైనది.

మనోరమ వోదార్చింది. "ఫర్ గెట్ ది పాస్ట్. జరిగిపోయింది రాదు. ఎంత విచారించినా ఏం ఫలితం లేదు. జరిగే దానికే మనం జాగ్రత్త పడాలి. ఎవరూ లేరన్న ధోరణిలో నిన్ను నువ్వు కాల్చుకున్నావు. ఎవరయినా వుంటే....

చక్రవర్తి సూటిగా చూశాడు. మనోరమ ధోరణి ఏం తెలియలేదు. ఆమె ముఖం నిశ్చలంగా వుంది. ఏ భావమూ గోచరించలేదు.

"లేనిది ఎక్కడ్నుంచి వస్తుంది మనోరమా? నా కెవరూ లేరు. లేరు. లేరు. స్నేహధర్మంగా నువ్వు ఆకాంక్షించినా అది తాత్కాలికం. నీ జీవితం వేరు. నాది వేరు."

"రెండూ ఒకటయితే..."

"అంటే."

"నీతో జీవితాన్ని పంచుకుంటాను. నీలోని మార్పుకి సంతోషిస్తాను. ఎవరూ లేరన్న భావం నీలో తుడిచివేస్తాను" ఆవేశంతో వణికింది.

"మ.... నో.... ర.... మా" ఆశ్చర్యం, ఆనందం, ఆవేశం,

ఆలోచనా అన్నీ చక్రవర్తి గద్దింపులో స్పష్టమయ్యాయి.

"ఎందుకరుస్తావ్?"

చక్రవర్తి సిగరెట్ పడేసి ఆమె దగ్గరికి వచ్చాడు. "నీ గొప్ప జీవితాన్ని నాతో ముడిపెట్టుకుని పాడుజేసుకోకు మనోరమా. ఆవేశంలో జీవిత నిర్ణయాలు తీసుకోకు. నేను దొంగని. సమాజంలో హీన స్థానంలో ఉన్నాను. అన్ని విధాల అర్థహైమైన జీవితం నీది. ఆ వెలుగుని ఈ చీకటితో పాడుచెయ్యకు. నాలో అంత స్వార్థం లేదు."

ఉద్వేగంవల్ల మనిషి ఎరుపు ఎక్కాడు. డ్రాయర్ మీద కూజాలోని మంచినీళ్ళు త్రాగాడు. అప్పటికి కాస్త ప్రశాంతత కల్గింది.

"నేనో నిశ్చయానికి వచ్చాను. ఇది నాకు నేనుగా వచ్చిన నిర్ణయం. ఇందులో ఎవరి బలవంతం లేదు. ఇది నీ మీద జాలితోగాని, సంస్కారిగా పేరు తెచ్చుకుందామని దురాశతోకాని చెయ్యటం లేదు. ఆవేళ రైలులో ఏమన్నావో తెలుసా.... నావల్ల చెడిపోయానన్నావ్. అందుకు నావల్లే తిరిగి బాగుపడు నువ్వు."

"వద్దు మనోరమా! నా కిష్టం లేదు."

"మరి ప్రేమలేఖ రాశావ్!" నవ్వుతూ అడిగింది.

"ఆ ఉద్వేగం, ఆ పరిస్థితి వేరు. నేను మనిషిగా ఉన్నప్పుడు నిన్ను కోరుకున్నాను. పొందలేకపోయాను. వదిలెయ్. ఆ గొడవ ఇప్పుడు వద్దు. నీ ఉన్నత జీవితానికి తగిన వారసుడ్ని నేను కాదు. నాపై ఉన్న సానుభూతికి చాల ఆనందిస్తున్నాను. ఇంతటి గౌరవాన్నిచ్చి నన్ను సిగ్గుపర్చకు. పైగా నువ్వు దానివల్ల ఎన్నో ఛాలెంజీలు ఎదుర్కోవాలి."

"నేను సిద్ధమే!"

చక్రవర్తి చికాకుపడిపోయాడు. ఈ వాతావరణం రేపే సంఘర్షణకి అతడు తట్టుకోలేకపోయాడు. మనోరమ ధోరణి అతడ్ని వివశుడ్ని చేస్తున్నాయి.

గడియారం ఒంటి గంట చూపుతోంది.

మనోరమ లేచింది. చక్రవర్తిని తన ఎడం చేత్తో స్పృశిస్తూ: డోంట్ వర్రీ. నేను బాగా ఆలోచించుకొనే చెబుతున్నాను. మన చుట్టూరా చీకటి వుంది. నిజమే. దాన్ని తిట్టుకుంటూ కూర్చోవటంలో అర్థం లేదు. ఏదో దీపం వెలిగించగలగాలి. అదే మనకి ఉపయోగం. నిన్ను మనస్ఫూర్తిగా ఇష్టపడి నా జీవితంలో చోటిస్తున్నాను. అది నాకు పూర్తిగా సమ్మత మయినది. దీనివల్ల నీ కుపయోగమే కలుగుతుందని నా నమ్మకం" మృదువుగా చెప్పింది.

"మరోసారి ఆలోచించుకో" బేలగా చూశాడు.

"నువ్వేదో ధైర్యవంతుడి వనుకున్నాను" నవ్వింది.

చక్రవర్తి ఆ నవ్వుకి పరవశించిపోయాడు. దగ్గరగా వచ్చి "నేను నా అదృష్టానికి పొంగిపోతున్నాను. కాని ఇది అపాత్రదానమని భావిస్తు న్నాను. ఇంటికి పోయి బాగా ఆలోచించు, ఎంతవరకూ సమంజసమో తెలుస్తుంది" అన్నాడు.

"నాకు రెండు నాలికలు లేవు. నీతో వేళాకోళం ఆడడానికి నాకు టైంలేదు" అంటూ వరండాలోకి వచ్చింది. వరండా నిశ్శబ్దంగా వుంది.

దూరంగా డ్రయివర్ కారు హారన్ మ్రోగిస్తున్నాడు.

"మరి వెళ్ళి రానా" అతడికేసి చూసింది.

తలూపాడు. "నీ నిర్ణయాన్ని మరోసారి సమీక్షించుకోవడం ఎంతయినా అవసరం మనోరమా? ఇంతకంటె నేనేం చెప్పలేను."

"నేను కూడా ఏం వినలేను. సాయంత్రం సిద్దంగా వుండు. ఇద్దరం కలసి ఇంటికి వెళదాం."

చక్రవర్తి ఆమె చెయ్యిని నొక్కి వదిలేశాడు.

"వో కె"

మనోరమ కారెక్కింది.

## 3

కేశవయ్య నిర్ఘాంతపోయాడు. మనోరమ నోటి నుంచి ఈ రకం సంభాషణ వినడానికి ఆయన సిద్ధంగా లేడు. విన్నప్పట్నుంచి ఎంతో ఆశ్చర్యం వేస్తోంది. మనవరాల్ని కృద్ధంగా చూస్తూ

"నీకుగాని పిచ్చి ఎక్కలేదు కదా!"

"నేను చెప్పినది నిజం తాతయ్యా."

మనోరమ నిశ్చలంగా సమాధానమిచ్చింది. కేశవయ్య ఉదయం బట్టలకొట్టుకు పోవడానికి సిద్ధంగా వున్నాడు. కాఫీత్రాగి వక్కపొడి నములు తున్నాడు. రాత్రినుంచి ఆలోచించి మనోరమ అప్పుడు చెప్పింది. అదే సరయిన అవకాశంగా తోచింది.

కనకమ్మ కాఫీ పట్టుకు వచ్చింది మనోరమకి. ఇద్దరూ ఏదో లోకంలో వుండటం చూసి ఆమె లోపలికి వెళ్ళిపోయింది.

నడిరాత్రి సూర్యుడ్నిచూసినట్లు కలవరబడిపోయాడు కేశవయ్య. ఆలోచనలు అలలుగా లేచి పడుతున్నాయి. మనోరమమీద కోపం వరద గోదారిలా పడుతోంది. ప్రజలచేత, ప్రభుత్వంచేత, "కేటు" ముద్ర వేయించుకున్న ఒక వెధవ మనోరమ మొగుడు. ఆపైన మరి ఆలోచించలేకపోయాడు.

"ఇన్నాళ్ళు నువ్వు చెప్పినట్లు వినడంవల్ల, ఇప్పుడు నువ్వు చెప్పింది

వినవలసివస్తోంది. నువ్వు పడిన పొరపాటుని మేం కూడ సమర్థిస్తే లోకం నవ్వుతుంది. మా పెద్దరికాన్ని తూర్పార పెడుతుంది. నీ పెళ్ళి కోసం మేమంతా ఎంతో ఆరాటపడుతున్నాం. ఎంత మంచి సంబంధమయినా నీకు సమర్థించడానికి తక్కువగానే తోస్తోంది. కాని నువ్వింత తెలివితక్కువగా ఆలోచిస్తావని మేం వూహించలేకపోయాం." కేశవయ్య కంఠం రుద్ధ మయింది. అంతరాంతరాల్లో పొంగిపొరలుతున్న బాధ వ్యక్తమయింది.

మనోరమ మాట్లాడలేకపోయింది. తాతయ్య కోపం ఎలా వుంటుందో యిన్నేళ్ళ జీవితంలో మొదటిసారిగా చూసి భయపడిపోయింది. పిరికితనం ఆవరించింది.

కాని తనకు తానే ధైర్యం చెప్పుకుంది. రోటిలో తలదూర్చింది. ఇప్పుడు భయపడితే లాభంలేదు. తను సాహసంతో ఒక నిర్ణయానికి వచ్చింది. అన్నివైపులా ప్రతిఘటన వుంటుంది. అందర్నీ ఒప్పించి తన దారికి తెచ్చుకోవటమే సాధించవలసిన కార్యం. ఈ సమయంలో తనుకూడ ఆవేశపడితే ఎలా?

"చక్రవర్తి నావల్లే చెడిపోయాడు తాతయ్యా. అన్ని విధాల పతన మయ్యాడు. అతడ్ని దారిలో పెట్టడం కనీస ధర్మం. అందుకే నేను అతడికి చోటిచ్చాను."

"నోర్ముయ్....చోటు యిచ్చావ్. మంచి పని చేశావ్. అప్పుడే పెద్ద దానివయిపోయావు. అన్నీ నువ్వే అనుకుంటున్నావు....ఆ పోకిరీ వెధవని బాగుచెయ్యడానికి నీకేం అవసరం? అంతగా అయితే అయిదారు వేలు పడెయ్య లేకపోయావా?"

మనోరమ బిక్కముఖం వేసింది.

కేశవయ్య ఆవేశాన్ని అణుచుకుంటూ: "వాడెవడో నీకు బాగా టోపీ వేశాడమ్మాయ్. ఆ మాయలో నువ్వు పడిపోయావ్. నీ కిన్నేళ్ళు

వచ్చినా, ఇంత చదివినా లోకం పోకడ తెలియదు. ఈ పెళ్ళికి నేనే కాదు. ఎవరూ ఇష్టపడరు. వృథాగా చేతులు కాల్చుకోకు. తల్లీ తండ్రీ లేని నిన్ను పెంచి పెద్దచేశాను. ఆ మూడుముళ్లూ కూడ సవ్యంగా పడితే నా బాధ్యత తీరుతుంది. పూర్వంలాగే నీకు వంత పాడితే ప్రపంచం వూరుకోదు. నీ పెద్దరిక మేమయిందని నిలేసి అడుగుతుంది. తప్పు నువ్వు చేస్తున్నా మేం కూడా భాగస్థులవుతాం. ఈ పొరపాటు వల్ల అనేక చిల్లర సమస్యలు పుడతాయి." నచ్చ చెప్పాడు.

అరగంట పాకింది పొద్దు.

సారాంశం — కేశవయ్య ఒప్పుకోలేదు.

మనోరమ తనపంతం విడిచిపెట్టలేదు.

"నువ్వెంత ఏడ్చినా ఫలితం వుండదు. ఇది పరువుప్రతిష్ఠకి సంబంధించిన వ్యవహారమని మరచిపోకు" హెచ్చరించాడు.

కేశవయ్య బట్టలకొట్టుకి పోయాడు.

కాని ఆవేశం తాలూకు నీడలు కేశవయ్యని వదిలిపోలేదు. మనోరమకి ఒక రాజకుమారుణ్ని తేవాలని ఆయన బంగారుకోరిక. అందుకే ఎన్నో సంబంధాలు వెతికాడు. తృప్తి కలుగలేదు. అయినా ఆయన నిరుత్సాహ పడలేదు. ప్రయత్నించి ఆశగా వెతుకుతూనే వున్నాడు. కాని అవాంతరం ఈరూపంగా వచ్చి దెబ్బకొట్టింది. హృదయానికి హత్తుకుపోయే నిరాశ మనిషిని కుదిపేస్తుంది. సంచలనం కల్గిస్తుంది. ఆ విషాదంయొక్క వత్తిడిని తట్టుకోవడం కష్టమవుతుంది. నీటి నుంచి వచ్చిన చేపలా గిలగిల లాడారు ఆయన. తన పెద్దరికం, మంచితనం అన్నీ నాశనమయ్యాయి. ఈ తప్పుకి అనేక కారణాలు కనిపించాయి. ముద్దు చెయ్యడమే పొరపాటయింది. చదువు చెప్పించకుండా వెంటనే పెళ్ళి చెయ్యావల్సింది. ఏ సమస్యా వుండక

పోసు. అంతలోనే కేశవయ్య తెప్పరిల్లాడు. ఈ చెడు వస్తుందని తను కల గన్నాడా? అయినా మనోరమలో ఈ తెలివితేటలు, తెలివితక్కువతనం ఎక్కడనుంచి వచ్చాయి. ఏ ఆడపిల్లయినా ఇటువంటి సాహసం చేస్తుందా? పెళ్ళన్నది జీవితాంతం వుండేపంట. అందుకోసం బలమైన విత్తనాలు నాటుకోవాలి. ఏ రకం విత్తనం వేస్తే ఆరకం పంటే వస్తుంది.

పదయ్యేదాకా అలాగే ఆలోచిస్తూ, యాంత్రికంగా కవుంటర్‌లో కూర్చున్నాడు. గుమస్తా యిచ్చే డబ్బుని నిర్లక్ష్యంగా లోపల పడవెయ్యడం తప్ప ఎవరితోనూ ఏం మాట్లాడలేదు. ఆలోచనలన్నీ మేశాడు. కుర్రాడ్ని కాఫీకి పంపాడు తలభారం ఎక్కువై. వెంటనే కృష్ణమూర్తికి ఉత్తరం రాసి పడేశాడు.

"....నువ్వు వెంటనే బయలుదేరవల్సింది. నీ చెల్లెలు ఇక్కడ ఘనకార్యంచేసి కూర్చుంది. పోకిరీ వెధవ ఏం చెప్పి పెట్టాడో, వాడ్నే పెళ్ళి చేసుకుంటానని కూర్చుంది. వాడు జేబులు కత్తిరిస్తాడు. జైలుకి పోతాడు. ఇదీ ఉద్యోగం. మన పిల్లకి ఎంతమాత్రం తగిన సంబంధం కాదు. కనుక నువ్వూ, మాధవీ వెంటనే బయలుదేరి రావలయును. సాధ్యమైనంత తొందరలో ఏదో సంబంధం మనం చెయ్యకపోతే మన గౌరవం మిగలదు."

కాఫీ త్రాగుతూ "ఎక్స్‌ప్రెస్ బిళ్ళ అంటించు" అంటూ కవరు కుర్రాడికిచ్చాడు.

ఇంతలో లత లోపలికి వచ్చింది.

ఆమెని చూడగానే కేశవయ్య కొద్దిగా తెప్పరిల్లాడు. మనోరమ ఉద్దేశ్యం తప్పక ఈమెకి తెలుస్తుంది. పైగా లత నచ్చ చెబితే వినకపోదు.

"రామ్మా" సాదరంగా ఆహ్వానించాడు.

లత పరుపుమీద కూర్చుని, "ఏమిటి తాతయ్యా అలా వున్నావ్?" ప్రశ్నించింది. మనోరమ లాగానే ఆమెకూడ 'తాతయ్యా' అంటుంది.

"మనవరాళ్ళు ఘనకార్యాలు చేస్తున్నారు మరి" గుబురు మీసాల్లోంచి, వక్రహాస్యం తొంగి చూసింది.

కథానిలయం 769 శ్రీకాకుళం

"అంటే...."

"నీకేం తెలియదా ఏమిటి?"

లత తల ఆడిస్తూ "నువ్వు చెప్పనిదే" అంది.

కస్టమర్సు లోపలికి వస్తున్నారు. గుమస్తా, పని కుర్రాళ్ళు, హడావిడిగా కనపడుతున్నారు. కేశవయ్య ఆ విషయం ఇంతమందిలో చర్చించడానికి యిష్టపడలేదు.

"లోపలికి రా...." ప్రక్క గదిలోకి దారితీశాడు.

ఏదో సీరియస్ వ్యవహారమని తోచింది. లత సర్దుకుని స్టూలుమీద కూర్చుంది. కేశవయ్య తలుపు దగ్గరగావేసి, "నీకు తెలియదంటావా" సాభిప్రాయంగా లత ముఖంలోకి చూశాడు.

అయోమయంగా అన్నది లత "నాకేం తెలియదు."

"మరి చక్రవర్తి ఎవరు ?"

చెప్పింది.

"ఆ లుచ్ఛావెధవని మనోరమ పెళ్ళిచేసుకుంటుందట, ఆశీర్వదించమని నన్ను అడిగింది." ఆవేశం పెల్లుబికింది ఆయనలో.

ఈ వార్త మొదటిసారిగా విన్నా లతలో అంతగా ఆశ్చర్యం కలుగ

లేదు. చక్రవర్తి మీద మనోరమ చూపుతున్న అభిమానం ఈ విధంగా దారి తియ్యవచ్చునని లీలగా ఆమెకి తట్టింది. ఇప్పుడు కేశవయ్య చెప్పగానే ఒక నిట్టూర్పు విడిచింది.

"ఇది నీకు ముందే తెల్సా?"

"అనుమానం మాత్రం వుంది"

కేశవయ్య ముందుకి వంగి: "మరి నాకు చెప్పలేకపోయావా?" ప్రశ్నించాడు.

లతకూడ తీవ్రంగా ఆలోచిస్తున్నది. మనోరమ, చక్రవర్తి అంత రంగంలో మెదిలారు. మనోరమ తొందరపడింది. హీనుడికి ఉన్నత స్థానం యిచ్చింది. ఇది తగదు. ఏ విధంగానూ చక్రవర్తి దీన్ని ఉపయోగించు కోలేడు. ఒకసారి పతనమయ్యాక, ఆ పాకుడు రాళ్ళమీద నుంచి పైకి ఎక్కడం అంత సులభంకాదు.

కేశవయ్యని వోదారుస్తున్నట్లు చెప్పింది. "నువ్వు ఆవేశపడకు తాతయ్యా. ఇది చాల డెలికేట్ వ్యవహారం. మనోరమ వ్యక్తిగా నిర్ణయం తీసుకుంది. కాదనడానికి మనం ఎవరం? దాని మొండితనం నీకు తెలుసు కదా? ఇన్నాళ్లు నాతో ఇంత స్నేహమున్నా చూచాయగానయినా చెప్పలేదు. నువ్వు చెప్పేదాకా నాకు అనుమానం వున్నది."

"అసలీ ముళ్ళకంపలో ఎలా పడింది?" నిరుత్సాహంగా అడిగాడు.

లత యావత్తూ విశదీకరించింది. కాలేజీలో పరిచయం, ప్రేమలేఖ వ్యవహారం, రైల్లో పరిచయం, యాక్సిడెంటు, స్వయంగా వానలో వెళ్ళడం అన్నీ చెప్పింది.

"దీనికేదో పిచ్చి ఎక్కింది."

"నువ్వేం కంగారుపడకు తాతయ్యా. నేను కనుక్కుంటాను."

కేశవయ్య తలుపు తీసి బయటికి దారితీస్తూ "ఏదోలా దానికి నచ్చ చెప్పు. నలుగురికి తెలిస్తే ఎంత అవమానం ?" అన్నాడు.

లత హాస్పిటల్‌కి ఫోన్ చేసింది.

"ఏమిటి విశేషం ?" మనోరమ పలికింది.

"నువ్వే చెప్పాలి మరి. హీరోయిన్ వయ్యావుకదా!"

"............"

"బయలుదేరి వస్తున్నాను."

"సారీ సాయంత్రం దాకా ఖాళీలేదు. పనిరద్దీగా వుంది."

లత పీస్‌మీద చెయ్యి అడ్డంపెట్టి "నేను ఫోన్ చెయ్యడం దానికి అనుమాన మొచ్చింది. ఖాళీ లేదంటోంది." చెప్పింది కేశవయ్యతో.

"చేసిన పని ఎలాంటిది ?"

"సాయంత్రం ఆరింటికి వస్తాను."

లత ఫోన్ వుంచేసి ప్యాకెట్లు చేతిలో పట్టుకుని వెళ్ళడానికి ఉద్యుక్తురాలై "ఆ విషయం నాకు వదిలెయ్యి తాతయ్యా. సాయంత్రం నేను కనుక్కుంటాను" అన్నది.

"నీదే భారం తల్లీ."

లత సాయంత్రందాకా యాంత్రికంగా గడిపింది. కేశవయ్య చెప్పినప్పట్నుంచి ఎప్పుడు మనోరమని చూద్దామా అన్న కలవరం బయలుదేరింది. ఆమె కంగారుకి తగ్గట్టు ఆరోజు పని ఎక్కువగా వుంది. పర్మిషన్ అడగ దానికి కూడ నోరు రాలేదు. ఏడున్నర ప్రాంతంలో తెరిపి చేసుకుని బయలు దేరింది.

చక్రవర్తి గేటుదగ్గర వున్నాడు. రిక్షాలో ఎక్కడికో పోతున్నాడు.

వరండాలో నిలబడి మనోరమ టా....టా చెబుతోంది. లతని చూసి రిక్షా బయలుదేరింది.

"బాగ్దాద్ ఎక్కడికో బయలుదేరాడే !" వ్యంగ్యం విసిరింది లత.

మనోరమ ముఖం ఎర్రగా చేసుకుని తనగదిలోకిపోయి కూర్చుంది. లత కూడ వెంటవచ్చింది. "ప్రేమికులు జంటగా వెళ్ళితేనే అందం ? ఏమంటావ్ ?"

"వో.... విషయం తెల్సిందన్నమాట" అన్నది మనోరమ బరువుగా నిట్టూరుస్తూ.

"ఘనకార్యాలు యిట్టే పాకుతాయి."

మెడికల్ జర్నల్ తిరగవేస్తోంది యాంత్రికంగా మనోరమ. లత ధోరణికి అదే జవాబుగా తోచింది. తాతయ్య అంతా లతతో చెప్పివుంటాడు. తనని క్రాస్ చెయ్యడానికి బయలుదేరింది.... ఛీ.... ప్రతీవాళ్లు తనని నిలదీసేవాళ్ళే. సానుభూతిగా అర్థం చేసుకునే వాళ్ళెవరూలేరు.

"పెళ్ళి ఎప్పుడు ?" లత మరోసారి ప్రశ్నించింది.

"త్వరలోనే" సమాధానం ముభావంగా వచ్చింది.

"జేబులు కత్తిరించే వెధవకోసం యిన్నాళ్ళు నిరీక్షించావన్నమాట."

కోపంగా అంది "చక్రవర్తిని అవమానించక."

"చక్రవర్తిని అనడం అనవసరం. దీనికి కేంద్రం నువ్వు. నిన్నే అనాలి. నీ తెలివితేటలకి సంతోషించాలో ఏడవాలో తెలియడం లేదు."

"ఆవేశపడకుండా నన్నర్థం చేసుకో లతా ? చక్రవర్తిని నైతికంగా బాగు చెయ్యడం నా ధర్మం. అందుకే ఈ బాధ్యతను పటిష్టం చెయ్యదల్చుకున్నాను పెళ్ళితో."

"ఈ సంస్కారం నీకెలా అబ్బింది ?"

"మీరంతా నన్ను పొడుచుకు తింటున్నారు."

లత లేచి ఆమె దగ్గరగా వెళ్ళింది. మనోరమని తన చేతో బుజ్జగిస్తూ "తాతయ్య ఎంత క్షోభ పడుతున్నాడో నీకు తెల్సా ? ఈ పెళ్ళన్నది నీకు ఒక్కదానికే సంబంధించినది కాదు. నీ చుట్టూ నీ వంశం, నీ పెద్దలు వున్నారు. వాళ్ళకిదెంత అఘాతమో నీకు తెల్సా ? అయినా చక్రవర్తిని సానుభూతితో పెళ్ళి చేసుకుంటున్నందుకు, రేపు సరయిన ప్రతిఫలం రాకపోతే చింతించవలసి వస్తుంది. ఇవన్నీ నీవు బాగా ఆలోచించావా ?" నచ్చచెప్పింది.

ఇన్నాళ్ళ స్నేహంలోనూ మనోరమ సమస్యలన్నీ లతే పరిష్కరించింది. ఏ చిన్న విషయమొచ్చినా లతనే ఆశ్రయించేది. కాని నేడు యిద్దరూ చెరో వైపు వున్నారు. సంఘటన తెచ్చిన 'యిరుకు' యిద్దరి మధ్య వున్నది. దానివల్ల బుసలు కొడుతున్నారు.

"ఎడ్వంచర్, నా కిష్టం లతా. అందుకే చేస్తున్నాను. ఫోర్‌కాస్ట్ చెయ్యడం మంచి పని కాదు. మానవుడు భవితవ్యాన్ని ఆశాజనకంగానే ఆశిస్తాడు. చక్రవర్తిలో తప్పక మార్పు వస్తుంది. అతడూ మనిషిగా సంఘంలో నిలబడతాడు."

లతకి కోపం ముంచుకు వచ్చింది. "చక్రవర్తిని ప్రేమించావా ?"

"ఆ.... పర్సనాలిటీ వుంది. మగాడు. ఎన్ని తప్పులు చేసినా మారాలి. ఇవాళో, రేపో ఏదో బిజినెస్‌లో చెయ్యి పెడతాడు. పాత తప్పులు అన్నీ సమసిపోతాయి."

"అని నువ్వు అనుకుంటున్నావ్. కాని సంఘం మిమ్మల్ని సాఫీగా వదలదు. ఎన్నో చిక్కులు తెచ్చిపెడుతుంది. సినిమాల్లో లాగా వెన్నెల

త్రాగేస్తూ, ప్రేమను తింటూ కాలం గడపడం దుర్లభం. వాస్తవానికి దూరం ఆలోచించుకోవడం దురాశే అవుతుంది. చక్రవర్తి మీద సానుభూతి వుంటే మరోలా పరిష్కరించుకో. కాని దారి యిది మాత్రం కాదు." లత తన భావాన్ని పునరుద్ఘాటించింది.

మనోరమలో పడ్డ బీజం పెరిగి మొలక ఎత్తింది. లేతదనం పోయి గట్టిపడింది. ఈ దశలో వంచడం కష్టమే మరి. ఎవరెన్ని చెప్పినా ఆమెలో ఏర్పడిన భావం జంకడం జరగదు. అందుకే లత ఎంత ఆవేశపడినా ప్రయోజనం లేకపోయింది.

"నువ్వు లక్ష చెప్పు. వింటాను. కాని నా నిర్ణయం మాత్రం మారదు. ఎన్ని ఆటంకాలు వచ్చినా చక్రవర్తిని పెళ్లి చేసుకుంటాను."

"ఛాలెంజీయా !"

"అనుకో."

లత అవమానంగా లేచి నిలబడింది. తనని బొత్తిగా నిర్లక్ష్యం చేయడం ఆమెకి బాధ వేసింది. తన రాకవల్ల ఏదైనా మార్పువస్తుందని చాలాసేపు వాదించి, విఫలురాలయింది. మనోరమని మళ్లించడం అసాధ్యంగా తోచింది.

"తెలిసి నిప్పులో చెయ్యి పెడితే ఎవరూ ఏం చెయ్యలేరు. దట్స్ యువర్ ఫేట్. ఇంత మందిని కాదని నువ్వు చేసిన సాహసం ఫెయిల్ అయితే జీవితం ఎంత దుర్భరమో అప్పుడు తెలుస్తుంది. ఆ రోజున నీకు సలహా చెప్పేవాళ్లు కానీ, సాయం చేసేవాళ్ళు కానీ దొరకరు. వయస్సు, డబ్బు, చదువు అన్నీ వున్నాయని నువ్వు విర్రవీగవచ్చు. ఇవేమీ కూడ నీకు ఆ రోజున సాయం చెయ్యవు."

లత వెళ్ళబోయి మనోరమ కంఠం విని గుమ్మం దగ్గర ఆగింది.

"బెదిరిస్తున్నావా?" అంటూ కుర్చీలోనుంచి లేచి గుమ్మంలోకి వచ్చి, "ఒడ్డున వుంటే అంతా లోతుగానే కనబడుతుంది. లైఫ్‌లోని ఏ ప్రాబ్లం అయినా సాల్వుచేసే కెపాసిటీ వుందని భావిస్తున్నాను." ఘాటుగా చెప్పింది.

"సీ ఎ హెల్" లత విసవిసా నడిచిపోయింది.

"లతా" వరండాలోకి వచ్చి పిల్చినా ఆగలేదు.

చక్రవర్తి వచ్చాడు "ఏమంటోంది స్నేహితురాలు. చాల కోపంగా వెళ్ళిపోతుంది."

"నన్ను ఎవరూ అర్థం చేసుకోవడం లేదు" గొణుక్కుంది.

చక్రవర్తి ఆమెను తన దగ్గరికి తీసుకుంటూ "నేను అర్థం చేసుకుంటాను మనో" అన్నాడు నెమ్మదిగా.

మెరిసే కళ్ళతో చూసింది. "నిజంగానా"

"నిజం"

చీకటి మత్తుగా పడింది. ఆకాశంలో నక్షత్రాలు మెరుస్తున్నాయి. హాస్పిటల్ గేటు దగ్గర దీపం వెలుగుతున్నది. హాస్పిటల్ వాతావరణం సద్దుమణిగింది. డ్యూటీ నర్సులు పైకీ కిందికీ తిరుగుతున్నారు. మనోరమని చూసి లోపలికి వస్తున్న నర్సు తప్పుకుంది.

మనోరమ వాచీ చూసుకుని, డ్యూటీ నర్సుకు వప్పగించి బయలు దేరింది.

"పిక్చర్‌కి పోదాం మనో" చక్రవర్తి సూచించాడు.

మనోరమ వెంటనే ఒప్పుకుంది. ఆమెకీ రిక్రియేషన్ కావాలి. మనస్సంతా గందరగోళంగా ఉంది. కారెక్కి స్టార్టు చేసింది. చక్రవర్తి ప్రక్కన కూర్చున్నాడు.

"ఇంటికి వెళ్ళిపో" డ్రయివర్‌కి చెప్పి ముందుకు పోనిచ్చింది.

స్పీడ్‌గా కారు సిటీలో పరుగులు తీస్తోంది. మనోరమ సీరియస్‌గా డ్రయివ్ చేస్తోంది. చక్రవర్తి ఏదో మాట్లాడబోయి వూరుకున్నాడు.

భోజనహోటల్ ముందు కారాగింది.

"మీల్సు చేద్దాం. నాకు ఆకలి వేస్తోంది."

ఇద్దరూ ఏ. సి. లో కూర్చున్నారు ఫ్యామిలీలో.

"మీ వాళ్ళు ఏమన్నారు?" చక్రవర్తి ప్రశ్నించాడు.

సాభిప్రాయంగా చూసి: "వాళ్ల ఏమన్నా అనవసరం. రెండవ తారీఖున మన రిజిష్టరు మ్యారేజి జరుగుతుంది." అంది.

చక్రవర్తి కళ్ళు వెలిగాయి. ఆమె చెయ్యి తీసి ముద్దు పెట్టుకున్నాడు. "ఇది నా అదృష్టం"

సర్వర్ భోజనం తెచ్చాడు.

"ప్రతిసారీ అలా ఫీలవక. ఇలాగయితే నీలో మగతనం చచ్చి పోతుంది. నిన్ను నీవు ఉన్నతం చేసుకుంటూ ముందుకుపోవాలి."

వీళ్ల వెళ్ళేసరికి సినిమా మొదలు పెట్టారు.

ప్రక్కనున్న సమస్యల్ని మరచిపోతూ మనోరమ సినిమాలో లీన మయిపోయింది. కాని చక్రవర్తి ఆమెని మాత్రం చూస్తున్నాడు. మనోరమ తనది అన్న భావం ఆతడికి ఎనలేని తృప్తి యిస్తోంది. ఒకనాడు ఆమె అందరాని వస్తువు. నేడు తన పాదాలముందు ఉన్నది. ఆమెని పొందడం నిజంగా తన అదృష్టం. అన్ని విధాలుగా పతనమయిన తనకి ఆమె దొరకడం వరమే మరి. ఇది తను మాత్రం అనుకున్నాడా?

అన్ని సంపదలు ఉన్న మనోరమ తన భార్య.

చక్రవర్తి కుడిచేత్తో ఆమెని పొడిచాడు కేవలం తన హక్కుని రుజువు చేసుకోడానికి. మనోరమ వంగి "ఏమిటి సినిమా చూడటం లేదా?" అనడిగింది.

"నిన్ను చూస్తున్నాను."

"నన్ను టికెట్ యిచ్చి చూడక్కర్లేదు. ఫ్రీ ప్యాసు" చిన్నగా నవ్వింది.

చక్రవర్తి సాధికారంగా నవ్వేడు.

వోడిపోయే పరిస్థితిలో ఉన్న రాజకీయ నాయకుడు హఠాత్తుగా ఘనవిజయం సాధించినా అంత సంతోషించి ఉండడు. మానవకల్యాణం నిమిత్తం మరో కొత్త ఫార్ములా కనిపెట్టిన సైంటిస్టు కూడా అంత ఆనందించి ఉండడు. ఎక్‌స్ట్రాగా ఉన్న తార బాక్సాఫీసు హీరోయిన్‌గా చలామణి అయినా అంత సంతోషం పొంది ఉండడు.

చక్రవర్తి వెన్నెలలో విహరిస్తున్నాడు.

కలల్లో తేలిపోతున్నాడు.

ఇంతలో చిన్న పరీక్ష ఎదురయింది. వో సాయంత్రం తను ఉంటున్న లాడ్జికి ఒక యువకుడు వచ్చాడు. మనోరమ కోరిక మీద పదిరోజులనుంచి లాడ్జిలోనే ఉంటున్నాడు.

"నా పేరు కృష్ణమూర్తి"

"వో. వెరీ గ్లాడ్. మనో బ్రదర్" కరచాలనం చేశాడు.

కృష్ణమూర్తి ఎట్టి ప్రసంగాలు చెయ్యకుండా జిప్పర్ తీసి "ఇవిగో పాతిక వేలు. మనోరమని మరచిపోయేందుకు మా కానుక. వెంటనే దూరం పోవాలి." హెచ్చరించాడు.

చక్రవర్తికి డబ్బు చూడగానే మతిపోయింది. తులాదండం వంగింది కాని అంతలోనే యధాస్థితికి వచ్చింది. "నేను డబ్బుకోసం గడ్డి తినే వెధవనే, కాదనను. కాని ఈనాడు ఆ వెధవ పని చెయ్యను. ఈ డబ్బుతో మనోరమని కొలవలేరు"

"మరో పాతికవేలు" బేరం హెచ్చింది.

రూపాయలు టేబిల్ మీదికి వచ్చాయి.

చక్రవర్తి విచిత్రంగా నవ్వాడు. "రూపాయలు అన్నివేళలా పని చెయ్యవు మిస్టర్. మీరు డబ్బు ఉందని మనుషుల్ని కొనడానికి ప్రయత్నించకండి"

కృష్ణమూర్తి హతాశుడయ్యాడు.

విషయం విని, మనోరమ నిర్ఘాంతపోయింది.

* * * *

రెండవ తారీఖున రిజిష్టర్ మ్యారేజి జరిగిపోయింది.

ఎవరెన్ని చెప్పినా, బెదరించినా మనోరమ చలించలేదు. ఏమాత్రం కూడా మార్పు చెందలేదు. అందర్నీ ఎదిరించి నిలబడింది.

లత స్నేహపూర్వకంగా హెచ్చరించింది-కాని ఫలించలేదు.

కేశవయ్య పెద్దరికం నిలబడలేదు.

కృష్ణమూర్తి వాత్సల్యం పనికిరాలేదు.

ముగ్ధగా వుండే మనోరమ, అమాయకంగావుండే మనోరమ, తేలికగా గాలిపటంలా కనిపించే మనోరమ స్థిరమూర్తి అయింది. ఛాలెంజీకి నిలబడింది.

"ఇది పాంచజన్యం కథ ఫలితమా?" మాధవి అడిగింది.

"కావచ్చు"

"నేనప్పుడే అనుకున్నాను''

"థాంక్స్"

తాను చేసిన పనికి పాంచజన్యం కథ ఎంతదాకా ప్రాతిపదిక అయి వుంటుంది? మనోరమ చాలాసేపు ఆలోచించింది. సహజంగా ఏర్పడిన పరిస్థితులా లేక పాంచజన్యం కథా?.... ఈ రెంటిలో ఏది ఎక్కువ అన్న ప్రశ్నకి మనోరమ జవాబివ్వలేదు. ఆ కలగూరగంపలో తనదారి ఎక్కడ నుంచి బయలుదేరిందో మనోరమకి తెలియదు. తను ఏర్పరుచుకున్న వ్యవస్థకి, పాంచజన్యం కథలోని సిద్ధాంతాలకి వర్తమానంలో ఆమె బేరీజు వేసుకునే పరిస్థితిలో లేదు. ఎన్నికచేసుకున్న దారి ముందరవుంది. దాని భవితపై ఆలోచించడం వివేకం. కాని గతాన్ని పునఃపరిశీలన చెయ్యడం అవివేకం.

ఇదీ మనోరమ వాదన.

కేశవయ్య తల్లడిల్లి పోయాడు. మనోరమ తప్పుచేస్తున్నదని ఒక వైపు, కుటుంబ సాంప్రదాయాలు మరొకవైపు. ఈ రెంటి మధ్య ఆయన నలిగిపోయాడు.

"ఏమిటమ్మా యిదంతా?" మాధవి ముందు వాపోయాడు.

ఆమె మాత్రం ఏం చేస్తుంది?

వెనకటి గౌరవాన్నిబట్టి మాధవి తానేదయినా చెయ్యగలనని అనుకుంది. కాని వాస్తవాన్ని చూశాక ఆమెకే నిరాశ వచ్చింది.

"మనమేం చెయ్యలేం" అన్నది కేశవయ్యతో.

"ఆ...." అదిరిపడ్డాడు.

కేశవయ్య బెదిరించాడు. లాలించాడు. తాను దూరదేశాలకి పోతానన్నాడు. ఆస్థిలో భాగం యివ్వనన్నాడు. కాని ఆ ముసలాయన తంత్రాలు ఫలించలేదు. ఆయన ఒకవిషయం మరిచిపోయాడు. కేశవయ్య బెదిరింపులకి ఆధారం ఏమీలేదు. ఎందుకంటే మనోరమ 'ఎదుగుదల'ని ఆయన గమనించలేదు. మనోరమ చదువుకుంది. ఆర్థికస్వాతంత్ర్యం వున్నది. ఇక ఆమె తిరుగుబాటు తనానికి అడ్డేమిటి?

కృష్ణమూర్తికూడా ఒక సమాధానానికి వచ్చేశాడు.

"అది చిన్నపిల్ల. మంచికో చెడ్డకో ఒక నిర్ణయానికి వచ్చేసింది. దాన్ని మనం నివారించలేకపోతున్నాం. వృధాగా కోపతాపాలు చూపకుండా నాలుగు అక్షింతలువేసి మన పెద్దరికాన్ని నిలుపుకుందాము."

"నోర్మూయ్యరా పిచ్చిసన్నాసీ. అజ్ఞానంతో అదేదో వాగితే, దానికి తాళం వేస్తానంటావ్? ఎందుకు లొంగదో చూస్తాను." కేశవయ్య భీష్మించుకుని కూర్చున్నాడు. ఆయనలో పాతరక్తం వుంది. ఆ తరం పట్టుదలవుంది.

మనోరమ చలించలేదు.

చలిచీమ కుట్టేదాకా తెలియదు.

ఏర్పాటులన్నీ రహస్యంగా ముగించి, ఆ రాత్రి కుటుంబంతో ఈ విషయం చెప్పింది. తాతయ్యని, మాధవి కృష్ణమూర్తులను రిజిస్ట్రారు ఆఫీసుకు రమ్మని కోరింది.

"పిలవడానికి నీకు సిగ్గులేకపోతే రావడానికి మాకు సిగ్గు వున్నదమ్మాయ్. చాల్లే మా మర్యాద యింతదాకా నిలిపావ్? ఇక నీ పెళ్ళికి రావాలి" కేశవయ్య భగ్గుమన్నాడు.

ఇప్పటిదాకా ఆయన వాత్సల్యాన్ని చూసింది. ఇప్పుడు కోపాన్ని చూసింది.

కళ్ళలో నీరు తిరిగింది. మాట్లాడకుండా మనోరమ పైకి వెళ్ళిపోయింది.

"మనం కూడ బెదరకొడితే ఎలా తాతయ్యా?" కృష్ణమూర్తి జోక్యం చేసుకున్నాడు.

కేశవయ్య రుషగా తల ఆడించాడు. తీక్షణంగా చూస్తూ "నీ చెల్లెమ్మ పసికూన కాదురా అబ్బాయ్. మనకే పాఠాలు చెబుతుంది"

తనని నిర్లక్ష్యం చేసినందుకు ఆయన బాధ.

మొత్తానికి మనోరమ – చక్రవర్తి దంపతులయ్యారు.

హాపీక్లబ్బువారు విందు ఏర్పాటు చేశారు.

సంక్షేమ శాఖామంత్రి సభని ప్రారంభిస్తూ ఈ తరం కొత్తవైపు పరుగులు తియ్యడం, మరో ప్రపంచాన్ని చూపించడం చేస్తోంది. ఇది వాంఛనీయం. మనోరమ చేసిన సాహసం పదిమందిని ప్రభావితం చెయ్యగలదని ఆశిస్తున్నాను." సంతోషం వ్యక్తం చేశారు.

పలువురు హాజరయ్యారు. శుభాకాంక్షలు తెలిపారు.

"పిచ్చిలో పడింది"

"ఆ దొంగ వెధవది అదృష్టం."

"లోగుట్టు పెరుమాళ్ళకెరుక."

....వగైరా విమర్శలూ, నవ్వులూ కూడా వచ్చినయి. మనోరమ రెంటినీ గమనించింది. మెచ్చుకున్న వారికంటె వెటకారం చేసినవాళ్ళే ఎక్కువని గ్రహించింది.

విందు జరుగుతోంది.

మనోరమ ఎవరితోనో మాట్లాడుతోంది. చక్రవర్తి గుమ్మం దగ్గర సిగరెట్ కాలుస్తూ నిలబడ్డాడు. ఇంతలో ఒక పోలీసాఫీసరు లోపలికి వచ్చాడు.

చక్రవర్తిని చూసి "ఏరా దొంగవెధవా ఇక్కడున్నావ్?" సాధికారంగా అడిగాడు.

కంపించాడు చక్రవర్తి.

"ఏమిటండీ?" ప్రక్కనున్న ఆసామీ అడిగాడు.

పోలీసు ఆఫీసరు నవ్వుతూ, "వీడు మా కాతాదారులెండి. ఈ మధ్య ఎక్కడా దర్శనంలేదు. ఇక్కడ చూస్తే అనుమానం వచ్చింది" మనోరమ కేసి వచ్చాడు.

భర్తని పరిచయం చేసింది, మనోరమ తేరుకుంటూ,

"అలాగా" పొడిగా నవ్వాడు పోలీసు ఆఫీసరు.

అంతమందిలో చక్రవర్తిని తిట్టడం అవమానించడం, చక్రవర్తి పిల్లిలా నోరుమూసుకుని కూర్చోవడం చాల బాధవేసింది మనోరమకి. ఆమెకి కోపం రేగినా బలవంతంగా దిగమింగింది. ఇటువంటి అవమానాలకి అలవాటుపడాలి. ఆవేశపడటం మంచిది కాదు. చక్రవర్తి గతం సంఘానికి హానిచేసేది. అందుకే పదిమందికి దుష్టుడయ్యాడు. ఈనాడు చెడ్డ నుంచి మంచికి వస్తున్నాడు. ఇది సంధికాలం. ఇక్కడే ఎన్నో పరీక్షలు ఎదురవుతాయి. వాటిని అధిగమిస్తేనే విజయం.

వచ్చేస్తూండగా కారులో అన్నాడు. "నాకు పోలీసులంటే భయం మనో"

"ఎందుకు? తప్పు చెయ్యనివాడికి భయం వుండదు"

"ఏమో మరి?"

శ్రీళ్ళిద్దరూ వచ్చేసరికి కృష్ణమూర్తి - మాధవి ప్రయాణంలో ఉన్నారు. రామయ్య సామానులు టాక్సీలో పెడుతున్నాడు. కేశవయ్య గేటు దగ్గర నిలబడి ఉన్నాడు.

"వస్తాను మనో. ఉత్తరం రాయి." పొడిగా వీడ్కోలిచ్చింది మాధవి.

కృష్ణమూర్తి నవ్వుతూ చెయ్యి వూపాడు.

టాక్సీ కదిలింది.

"అందరికీ దూరమై పోతున్నాను" అనుకుంది మనోరమ.

ఆ రాత్రి పదింటిదాకా విచారంగా ఆలోచిస్తూనే వుంది. మాధవి కోపంగా వెళ్ళిపోవడం బాధగానే వుంది. కేశవయ్య మౌనవ్రతం పట్టాడు. ఇవన్నీ మనోరమని కదిలించి వేస్తున్నాయి.

"ఏమిటలా వున్నావ్?" చక్రవర్తి భార్య మంచం మీదకి వచ్చాడు.

"ఏం లేదు" మనోరమ మరోవైపుకి తిరిగింది.

"ఏదో వుంది" చక్రవర్తి ఆమెని తనవైపుకి తిప్పుకున్నాడు. తెల్లటి బట్టల్లో పాలరాతి బొమ్మలావున్న ఆమెని ముమ్మారు ముద్దుపెట్టుకున్నాడు.

"ఛీ . ." వదిలించుకునే ప్రయత్నాలు చేసింది.

"ఏం దొంగాడిముద్దు బాగోలేదా?"

"మంచాడిముద్దు కావాలి"

"అబ్బో ఆశ"

"దురాశకాదు" నవ్వింది.

చక్రవర్తి ఆమెని తనలోకి తీసుకుంటూ "నేను చాల అదృష్ట వంతుడ్ని మనో. ఇందుకు చాల గర్వంగా ఉన్నది." ఆనందం వ్యక్తం చేశాడు.

*　　　*　　　*

ఆశించిన దానికంటె నెరవేరినది తక్కువగా వుంటే అసంతృప్తి బయలుదేరుతుంది. నిరుత్సాహం జనించడం సామాన్యం. మనోరమ పెళ్ళిలో ఈ రకం ఆశాభంగమే చెందాడు కేశవయ్య. మనోరమ మీది కంటే చక్రవర్తి మీద కోపం రేగింది ఆయనకు. అది అమాయకురాలు. వాడే ఏదో మోసగించాడని ఆయన అభిప్రాయం. దానికి సాయం బయట పరిచితులు వేళాకోళాలు ప్రారంభించారు. ఇవన్నీ తట్టుకోవడం అసంభవంగానే తోచాయి.

సరిపడని పరిస్థితులలో అమరడం ఆయనకి బొత్తిగా యిష్టంలేదు. చక్రవర్తి ప్రవర్తన, వ్యక్తిత్వం, వెకిలితనం అన్నీ కంటగింపుగానే కన పడ్డాయి. ఇంట్లో వుండి ఈ అసంతృప్తిని పెంచుకోవడం వల్ల ఏమీ ఫలితం లేదు.

అందుకే వ్యాపారాన్ని రూపాయిల్లోకి మార్చేసి, కృష్ణమూర్తికి ఉత్తరం రాసి బయలుదేరాడు యాత్రలకని. అలాగయినా మనశ్శాంతి పొందుదామని ఆయన ఉద్దేశం.

ఆ ప్రయాణం హడావిడి చూసి "ఎక్కడికి తాతయ్యా?" మనోరమ అడిగింది. "వోపికుండగానే నాలుగు యాత్రలూ చేసి వస్తాను." పొడిగా వచ్చింది సమాధానం.

తాతయ్య తనని క్షమించలేదు. కోపగించి యిల్లు వదలి పోతు న్నాడు. కాళ్ళమీద పడా లనిపించింది. కాని ఇంతలో మనోరమకి అభి

మానం అడ్డు వచ్చింది. ఇందులో తను చేసిన తప్పు ఏముంది ఇంత మంది మాతులు బిగించడానికీ? తనకి మాత్రం పౌరుషం లేదా?

కేశవయ్య వెళ్ళిపోయాడు. కూడా రామయ్య వెళ్ళాడు. "మీరు లేకుండా యిక్కడ వుండను."

మనోరమకి ఉక్రోషం వచ్చింది. "అంతా పొండి. ఇక్కడ ఎవరూ వుండొద్దు. ఏం కనకమ్మా నువ్వూ పోతావా?"

కనకమ్మ మాట్లాడలేదు.

రోజులు గతించి పోతున్నాయి.

చక్రవర్తి పని హాయిగా వుంది. శుభ్రంగా తినడం, అయిదారు సిగరెట్టు పెట్టెలు కాల్చడం, డబ్బుతో రమ్మీ ఆడటం, వో బ్రాందీ బాటిల్ త్రాగి రాత్రి పదకొండుగంటలకి యింటికి రావడం .... యిదీ కార్యక్రమం.

మనోరమ బ్రతిమాలింది. కోప్పడింది. నచ్చచెప్పింది. కాని ఫలితం శూన్యం. చక్రవర్తి ఏమీ లక్ష్యపెట్టలేదు.

"నాకేం .... హాయి. నువ్వు సంపాదిస్తున్నావు. నేను జల్సా చేస్తాను. నేను కూడ కష్టపడటం అనవసరం" ఇదీ సమాధానం.

మనోరమ దిక్కులు చూస్తోంది.

ఈ మలుపునుంచి తను పొందినదేమిటి? చక్రవర్తికి ఉత్తమ జీవితం యిచ్చి మహోత్తమంగా మార్చాలని చూసింది. అన్నిటికీ నిల బడి సాధించింది. కాని అంచనా వేసుకున్న జీవితం ఆవిరయి పోతున్నది. ఈ చక్రవర్తి కోసం తను ఎన్నో పోగొట్టుకున్నది. తాతయ్య దూర తీరా లకి వెళ్ళిపోయాడు. అన్నయ్యా వదినా కష్టపెట్టుకున్నారు. మంచి స్నేహితు

రాలు లత కూడా దూరంగా వుంటోంది. భరించలేని అవమానాలు పొందుతోంది. బాగా పరిచితులు "దొంగగారు" ఏం చేస్తున్నారు అంటూ పేళాకోళాలు. చివరికి నర్సులు, కంపౌండర్లు కూడ వెనకటి గౌరవాన్ని చూపించడం లేదు. తన వెనక ఎంతో అపహాస్యంగా మాట్లాడుతున్నారు. పేషెంట్లు కూడ తగ్గిపోయారు. సమాజంలో తన స్థానం దిగజారిపోయింది. నలుగురిలోను చులకనయి పోయింది.

ఇవన్నీ ఒక వైపు - ఎంచుకున్న చక్రవర్తి జీవితం మరొకవైపు.

చీకటి— చీకటి.

వెలుగును అంతా ఆర్పుకుని చీకటిని స్వీకరించింది. చక్రవర్తి కోసం తను చేసిన త్యాగం, సాహసం అన్నీ బూడిదలో పోసిన పన్నీరయినాయి.

దీని కోసమా ఎదురు చూస్త?

మనోరమలో ఉత్సాహం నశించింది. వెనకటి చలాకీతనం మృగ్యమయింది. తన గది దాటి రావడం లేదు. బయటి ప్రపంచంలోకి రావడానికి భయపడుతున్నది. ప్రాక్టీసునంతా వదిలేసింది.

వో మధ్యాహ్నం భోజనానికి క్రిందికి దిగి వచ్చింది. హాల్లో పది మంది దాకా వున్నారు. చక్రవర్తి వున్నాడు. అంతా నవ్వుతూ ఉషారుగా వున్నారు. మనోరమకి వాళ్ళ మీద సదభిప్రాయం కలుగ లేదు. సంస్కారంలేని మనుషులు క్రింద కనిపించారు. వెంటనే వంటింటిలోకి వెళ్ళిపోయింది.

"కనకమ్మా పది మందికి వంట చెయ్యి" చక్రవర్తి లోపలికి వచ్చాడు.

"ఎవరు వాళ్ళు?" నిశితంగా ప్రశ్నించింది.

"స్నేహితులు"

"జైలు బాపతా?" కసి ధ్వనించింది.

"నీ కనవసరం" మగతనం కనపడింది.

చక్రవర్తి వెళుతున్నవైపు చూసి కనకమ్మకేసి తిరిగింది. "నువ్వేం చెయ్యనక్కరలేదు. మాట్లాడకూరుకో. ఇలాంటి వెధవలకి విందులు తక్కువ వచ్చాయి."

"ఎలాగమ్మా నా మీద విరుచుకు పడతాడేమో."

"భోజనంచేసి, సాయంత్రం దాకా ఎక్కడికయినా పో"

మనోరమ యాంత్రికంగా భోజనం ముగించి మేడమీదికి వెళ్ళింది. రేడియో ఆన్‌చేసి మంచంమీద పడుకుంది ఆలోచిస్తూ.

అరగంటలో చక్రవర్తి వచ్చాడు కోపంగా "ఎక్కడ చచ్చింది కనకమ్మ"

"ఏమో?"

"నువ్వే పంపించి వుంటావ్. నలుగురిలో అవమానం.... చేశావ్"

వెటకారంగా నవ్వింది. "దొంగలకి కూడా అవమానం ఉందన్న మాట"

"నోర్ముయ్" వళ్ళు తెలియని ఆవేశంతో దగ్గరగావచ్చి అంతలోనే ఆగిపోయాడు. మనోరమని అసహ్యంగా చూస్తూ బయటికి వచ్చాడు.

నలుగురిలోనూ తను అదృష్టవంతుడని, తన జీవితం గురించి గొప్పగా చెప్పుకున్నాడు. విందుకి అందరినీ వుండమన్నాడు. ఇప్పుడెలా? బొమ్మంటే నలుగురూ గేలిచేయరూ? చక్రవర్తి క్రిందికి వచ్చి హోటల్‌కి ఫోన్ చేశాడు.

"పదిమందికి లంచ్ ఏర్పాటు చెయ్యండి" అంటూ.

చక్రవర్తి స్నేహితులు సామాన్యులు కారు. శుభ్రంగా భోజనంచేసి కిళ్ళీలు బిగించారు. తమతో చక్రవర్తిని కూడ రమ్మని కోరారు.

"ఎక్కడికి?" విస్మయంగా అడిగాడు.

జోగినాధం కారాకిళ్ళీ వుమ్మేస్తూ" ఏం తెలియనట్లు నాటకమాడకురా బాబూ, మనమంతా ఎన్ని దొంగతనాలు కంబైండ్‌గా చెయ్యలేదు? కేవల్‌సింగ్ నగల కొట్టుపని పడదామని వచ్చాం. ఇంతలో నువ్వు కనిపించావ్" చెప్పాడు.

చక్రవర్తి ఒప్పుకోలేదు.

"ఏంట్రా పెళ్ళానికి భయపడి చస్తున్నావ్"

అంతా నవ్వారు.

చక్రవర్తిలో పౌరుషం విజృంభించింది. "అయితే నడవండి."

ఈ మధ్య ఎడ్వంచర్స్ లేక చక్రవర్తి అదోలా ఉంటున్నాడు. దీనితో ఉత్సాహం బయలుదేరింది. తను ఏర్పరుచుకున్న కొత్త ప్రపంచం, మనోరమకి చేసిన వాగ్దానాలూ అన్నీ మరచిపోయి, క్షణికావేశంలో పాత జీవితాన్ని అందుకున్నాడు.

నాలుగున్నరకి మనోరమ నిద్రలేచింది. హాల్లోకి వచ్చి కూర్చుంది. అంతలో కనకమ్మ టీ తీసుకు వచ్చింది.

"చక్రవర్తి ఏడీ?"

తెలియదండి కనకమ్మ.

రిక్షాదిగి లత లోపలకి వచ్చింది. మనోరమ సంతోషంగా చెయ్యి వూపింది. ఆమెనిచూసి నెలకిపైగా అయింది.

"నీకూ్కడ విషమయి పోయానన్న మాట" నిష్ఠూరంగా అడిగింది మనోరమ.

"ఛ.... ఛ.... ఖాళీలేక రావడం లేదే."

ఇద్దరూ టీ త్రాగి మేడ ఎక్కారు.

"ఏమిటలా నీరసంగా వున్నావ్?" ఆప్యాయంగా అడిగింది లత.

"ఏముంది?"

"ఏదో వుందిలే. చక్రవర్తి ఎలా వున్నాడు?"

లత ధోరణి చూసి చల్లబడింది మనోరమ. వ్యంగ్యం లేదని తెలిశాకా సర్వం చెప్పింది. వర్తమానంలోని సమస్యలు అన్నీ వివరించింది.

"తప్పు చేశానేమో లతా! చక్రవర్తి విషయంలో నా అంచనాలు తప్పయ్యాయి. జల్సాగా తిని తిరగడం, క్లబ్బులో తందనాలు ఆడటం తప్ప మనిషిగా బ్రతకడం లేదు. బాధ్యతగా జీవించడంలేదు. ఇంత మందిని దూరం చేసుకుని నేను చేసిన ఘనకార్యం యిదీ" లత ఒడిలో విషాద తీవ్రత చేత వాలిపోయింది.

లత లేవనెత్తింది. తన చేతులతో ఆమె కన్నీరు తుడుస్తూ, "ఈ దశలో ఆ భావం రాకూడదు మనో. లోకం నువ్వు వోడిపోయావంటుంది. ఎంచుకున్న జీవితం ఎదురుతిరిగినప్పుడు మచ్చిక చేసుకుని మలచుకోవాలి. ఈ అసంతృప్తివల్ల నీకేం ఉపయోగంలేదు." వోదార్చింది.

సోము పైకి వచ్చాడు పరుగెత్తుకుంటూ.

"ఏరా?"

"పోలీసులు.... వచ్చారండి."

ఇద్దరూ క్రిందకి దిగారు.

కానిస్టేబుల్ విష్ చేసి చెప్పాడు. "చక్రవర్తిని అరెస్టు చేశాము."

అదిరి పడింది మనోరమ: "ఏం?"

"కేవల్ సింగ్ నగలకొట్టు చోరీలో."

మధ్యాహ్నం సంఘటనలన్నీ జ్ఞాపకం వచ్చాయి. వాటి నుంచి తేరుకుంటూ "నేను వోడిపోయాను లతా" అన్నది నిర్వేదంగా.

"ముందర అసలు విషయం చూడు" లత ధైర్యం చెప్పింది.

* * * *

వెయ్యి రూపాయల ఖర్చుతో చక్రవర్తి బయటికి వచ్చాడు. జరిగిన దానికి పశ్చాత్తాపం అతడి ముఖంలో కనబడుతున్నది.

"నీకు ఈ జీవితమే సుఖంగా ఉంటే యిక్కడ్నుంచిపో. నలుగురిలో నన్ను అపహాస్యం చెయ్యకు. దొంగలాగే బ్రతికి, దొంగలాగే చచ్చిపో" చక్రవర్తి రాగానే ఆవేశంగా విరుచుకుపడింది.

చక్రవర్తి ప్రాధేయపూర్వకంగా అన్నాడు "నను క్షమించు మనో. నాలో ఏదో బలహీనత ఆవరించి ఆక్షణంలో అలా నడిపించింది. అది పునరావృతం కాకుండా జాగ్రత్తపడతాను."

"నీతో జీవితం పంచుకోవడం నేరమయితే దానికిది శిక్ష" మనోరమ నేత్రాలు సజలమయ్యాయి. చక్రవర్తిని చూస్తూంటే హృదయం భగ్గుమంటోంది.

ఆమె కోపం తగ్గేదాకా చక్రవర్తి ఇల్లు కదలలేదు. తనలోని మార్పు భార్య గమనించాలని తాపత్రయపడ్డాడు.

"ఫర్వాలేదు." మనోరమ గుర్తింపు లభించింది.

ఇద్దరి మధ్య ఎడం క్రమంగా తగ్గుముఖం పట్టింది. చక్రవర్తి ఆత్మ

సంస్కారానికి మిక్కిలి పాటుపడ్డాడు. అతని ధ్యేయం మనోరమ మెప్పు పొందడమే. అతడి మనస్తత్వంలో కూడా మార్పు కలిగింది. మనోరమని పెళ్ళిచేసుకున్న కొత్తలో ఆమె మీద మోజుతప్ప మరేంలేదు. తన గురించి కూడా పెద్దగా ఆలోచించుకోలేదు. తన జీవితాన్ని సరిదిద్దుకోవాలన్న ఉత్సాహం కూడా అతడిలో కలగలేదు. తను సాధించిన ఘనవిజయ గర్వంలో బ్రతికాడు.

క్రమేణా జీవితం తెలియవచ్చింది. అందులోని మంచి చెడ్డలు తెలియసాగాయి. మనోరమ చేసిన త్యాగం, ఆమె పొందుతున్న క్షోభ గుర్తించాడు.

"నీతో జీవితం పంచు...." ఆ వాక్యమే మార్మోగుతుంది.

చక్రవర్తి లారీ ట్రాన్సుపోర్టులో గుమస్తాగా చేరాడు. ప్రొద్దుటే పోయి రాత్రి తొమ్మిదింటికి రావటం. పని ఎక్కువయినా యిప్పుడు అతడికి సంతృప్తిగా ఉంది. మనోరమ మీద ఆర్థికంగా ఆధారపడనక్కరలేదన్న ధీమాఒకటి, ఆమె యొక్క అనురాగం లభిస్తుందన్న గర్వమొకటి 'ఆ కష్టాన్ని' తెలియనివ్వలేదు.

ప్రశాంతత చేరుకోవడం వల్ల, మనోరమ తెప్పరిల్లింది.

మామూలుగా హాస్పటల్‌కి పోయివస్తోంది.

చక్రవర్తి తన మొదటినెల జీతం భార్యకిచ్చాడు.

అతడిలో ఉత్సాహం. ఆమెలో వెలుగు.

ఆరు నెలలు గడిచిపోయాయి. మాధవికి ఉత్తరం పోస్టు చేసింది.

"వదినా!

వైకుంఠ పాళీలో చిన్న చిన్న పాములు మింగినా తర్వాత నిచ్చెనలే దొరికాయి. చక్రవర్తి సమాజంలో స్థిరపడగలిగాడు. ఈ మధ్యే

స్వంతంగా లారీ ట్రాన్సుపోర్టు కంపెనీ పెట్టాడు. ఆ బిజినెస్‌లోపడి బిజీగా వుంటున్నాడు. కాలానికి ఎదురు నిలబడినా, విజయం సాధించినందుకు సంతోషంగా వుంది. అన్నయ్యా, నువ్వూ ఒకసారివచ్చి వెళ్ళవలసింది. తాతాయ్య సమాచారం వ్రాయవలయును.

ష. రా: త్వరలో ఉయ్యాల.

మనోరమ".